

మధుబాబు
చిచ్చర పిడుగు
/Rs. 6

# చిచ్చరపిడుగు

## రచన

## మధుబాబు

ప్రథమ ముద్రణ:జనవరి,1991

"రాజూ!" అన్నాడు ముఖేష్ - షాడో భుజం మీద చెయ్యివేసి.

కళ్ళు తెరిచాడు షాడో. బద్ధకంగా వళ్ళు విరుచుకొని కిటికీలోనుంచి కిందికి చూశాడు.

దూరంలో - సిడ్నీ ఎయిర్ పోర్ట్ దీపాలు మినుకు మినుకు మంటూ కనిపిస్తున్నాయి. ఏటవాలుగా కిందికి దిగుతున్నది వారి విమానం. ఆ దీపాలు క్షణక్షణానికి దగ్గిర అవుతున్నాయి.

"సిడ్నీతో మన జర్నీ ఎండ్ అయితే బాగుండు రాజూ... గ్రెగరీ మన మెస్సేజి అందగానే ఏదైనా యాక్షన్ తీసుకొనివుంటే ఎంత ముచ్చటగా వుంటుంది!" షాడో భుజంమీది నుంచి ఎయిర్ పోర్టు దీపాలను చూస్తూ కామెంట్ చేశాడు ముఖేష్.

నిర్లిప్తంగా తల ఆడించాడు షాడో. నిజమే మరి! సిడ్నీతో తమ ప్రయాణం ఆఖరైపోతే బాగానేవుంటుంది. కానీ ఆఖరు అవ్వాలి కదా!!

వారం రోజులనుంచీ...నిలబడినచోట కూర్చోకుండా, కనిపించిన విమానాన్ని వదలకుండా ... ప్రయాణం చేస్తున్నారు వారిద్దరూ. ఏ

నిముషానికి ఆ నిముషం ... తమ ప్రయాణం అంతం అయిపోయిందనే అనుకుంటూ వచ్చారు. మరునిముషం అది ఇండెఫినిట్ గా కంటిన్యూ అవుతూనే వస్తున్నది.

సిడ్నీ ఎయిర్ పోర్టులో దిగింది విమానం. రన్ వేమీది నుంచి నెమ్మదిగా ఎయిర్ పోర్టు బిల్డింగుల దగ్గరికిపోయి ఆగింది.

అందరికన్నా ముందుగా కిందికి దిగి కస్టమ్స్ కౌంటర్ దగ్గిరికి వెళ్ళారు స్నేహితులు యిద్దరూ.

కౌంటర్ పక్కనే నిలబడివున్నాడు గ్రెగరీ. ఆరు అడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తున్నాడు...ఆస్ట్రేలియన్ క్రైమ్ బ్రాంచిలో డెప్యూటీ కమీషనర్ అతను.

షాడో, ముఖేష్ లు ఆస్ట్రేలియా మిలటరీ కాలేజిలో స్పెషల్ ట్రెనింగ్ కి వచ్చినప్పుడు గ్రెగరీ వారికి పరిచయం అయ్యాడు. కాలక్రమాన ఆ పరిచయం ప్రాణ స్నేహంగా మారింది.

"హల్లో రాజూ!! హల్లో ముఖేష్ !! యూ బ్లడీ ఛార్మింగ్ సైంటిఫికల్ ఇడియట్" అంటూ వచ్చి వారిద్దరినీ ఒకేసారి కౌగిలించుకున్నాడు గ్రెగరీ.

మిలటరీ కాలేజిలో స్పెషల్ సబ్జెక్ట్ కింద కెమిస్ట్రీ తీసుకున్నాడు ముఖేష్. ఒకసారి ఏవో ద్రావకాలను టెస్ట్ చేస్తూ, పొరపాటున ఒక ద్రావకాన్ని యింకొక ద్రావకంతో కలిపాడు. పెద్ద ప్రేలుడు

సంభవించింది. లాబరేటరీలో ఒక భాగం నామరూపాలు లేకుండా పోయింది. పెంట్రుకవాసిలో చావు తప్పించుకొని బయటపడ్డాడు ముఖేష్.

కాలేజీ అధికారులు అతన్ని గట్టిగా మందలించారు. స్నేహితులు గ్రెగరీలాంటి ఆప్తమిత్రులు ఆ క్షణం నుంచీ అతనికి మాస్టర్ సైంటిస్ట్ అని పేరుపెట్టి వెక్కిరించటం ప్రారంభించారు.

అయితే ఆ రోజు ముఖేష్ చేసిన ఎక్స్ పరిమెంట్ ని ఆధారంగా చేసుకునే సి.ఐ.బి. సైంటిస్టులు - అతి భయంకరమైన 'లిటిల్ టామీ' అనే పోర్టబుల్ బాంబును తయారు చేయగలిగారు. ఆ సంగతి గ్రెగరీకి తెలుసు. మరెవ్వరికీ తెలియదు.

"నీ ఆహ్వాన సందేశాలు తర్వాత చదువుదువుగాని.... ముందు అసలు విషయం చెప్పు. మేం పంపించిన మెస్సేజి అందిందా?" గ్రెగరీ పట్టులోనుంచి బయటపడటానికి విఫలప్రయత్నంచేస్తూ అడిగాడు ముఖేష్.

గ్రెగరీ ముఖంమీది నవ్వు మాయమైపోయింది. "సారీ ముఖేష్... ఐయామ్ రియల్లీ వెరీవెరీ సారీ...మీ మెస్సేజి నాకు లేటుగా అందింది. అందిన వెంటనే యిక్కడికి వచ్చాను. అప్పటికే తప్పించుకున్నాయి పిట్టలు. 'లోర్నాడ్యూన్' అనే స్టీమర్ లో షిరోనా ఐలండ్స్ వైపు పోయినట్లు తెలిసింది." అన్నాడు.

అతని జేబులోవున్న సిగిరెట్ పాకెట్ అందుకొని సిగిరెట్ వెలిగించుకున్నాడు ముఖేష్. "రాజు ... మళ్ళీ కథ మొదటికి వచ్చింది." అన్నాడు షాడోవైపు చూస్తూ.

పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని, సీరియస్ గా అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు షాడో.

"ఆల్ రైట్ ...మనంకూడా వెంటనే ప్రయాణం ప్రారంభించటం చాలామంచిది. వెంటనే బయలుదేరే స్టీమర్స్ ఏమైనావున్నాయా?" అని ప్రశ్నించాడు.

"ఎల్లుండి బయలుదేరుతుందొక స్టీమర్. రేపు సాయంత్రం బయలుదేరుతుంది ఒక డకోటా విమానం.." సమాధానం యిచ్చాడు గ్రెగరీ.

"ఈ లోపల వాళ్ళు షిరోనా దుర్గమారణ్యాలలోదూరి మాయం అవుతారు... మేము మరొక్కక్షణం కూడా వేస్ట్ చేయటానికి వీలులేదు. స్టీమర్ కంటె ముందుగా మేము షిరోనా ఐలాండ్స్ చేరుకోవాలి" అన్నాడు ముఖేష్.

వెంటనే సిడ్నీ హార్బర్ కి వారిని తీసుకుపోయాడు గ్రెగరీ. అక్కడ హార్బర్ అధికారులతో మాట్లాడి ఒక మోటారుబోటును అరేంజి చేశాడు.

"విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్ మై ఫ్రెండ్స్! షిరోనాలో పనులు త్వరగా జరగాలని అనుకుంటే నాకు వార్త పంపండి...నా ఇన్ఫ్లుయెన్స్ ని వుపయోగిస్తాను." అంటూ వీడ్కోలు యిచ్చాడు.

మూడు రోజులపాటు సముద్రంలో ప్రయాణంచేసి షిరోనాలో ముఖ్యమైన రేవు పట్టణం సోఫీ చేరుకున్నారు షాడో ముఖేష్ లు.

నాలుగవరోజున ఉదయం పదిగంటలకు లోర్నాడ్యూన్ సోఫీ హార్బర్ లోకి రాగానే దాని కాప్టెన్ ని కలుసుకున్నారు.

"ఐయామ్ సారీ సర్ ... మీకు కావాల్సిన వ్యక్తులు నిన్నరాత్రే ఓడ వదిలి పారిపోయారు." అన్నాడు కాప్టెన్.

"ఓడ వదిలి పారిపోయారా? వాట్ డూయూ మీన్?" ఆశ్చర్యంగా అడిగాడు ముఖేష్.

"నిన్నరాత్రి ఓడలోవున్న జనరేటర్ పాడయిపోయింది. దాన్ని రిపేర్ చేయటానికి రెండుగంటలసేపు ఓడను ఆపవలసి వచ్చింది తిరిగి ప్రయాణం ప్రారంభిస్తుండగా...ఓడ వెనుక భాగంలో డెక్ మీద వుండవలసిన లైఫ్ బోటు ఒకటి కనిపించలేదు. ఎంక్వయిరీ చేశాము. థర్డ్ క్లాస్ ప్రయాణీకులు ఆరుగురు అయిపూ అంతూలేరు. వాళ్ళే లైఫ్ బోట్ ని అపహరించారని తేలింది."

ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు షాడో ముఖేష్ లు. కాప్టెన్ కి తమ కృతజ్ఞతలు తెలియజేసుకొని ఓడ దిగారు.

అనుకున్నంతా అయిందిరాజూ... వాళ్ళు ... షిరోనా అరణ్యాలవైపే ప్రయాణిస్తున్నారు." హార్బర్ బిల్డింగులనుదాటి రోడ్డుమీదికి వస్తూ అన్నాడు ముఖేష్.

సిగిరెట్ కాలుస్తూ సాలోచనగా అడుగులు వేస్తున్నాడు షాడో. ఒక షాపునుచూసి - లోపలికిపోయాడు. షిరోనా ఐలండ్స్ నన్నిటినీ వివరంగాచూపే మాప్ నొకదాన్ని ఖరీదుచేసి షాపు ఎదురుగావున్న హోటల్ లోకి దారితీశాడు.

రెండు గంటలపాటు మాప్ ని పరీక్షించారు యిద్దరూ.

"రాజూ...మన స్నేహితులు ఖచ్చితంగా యీ ప్రదేశంలో వడ్డును చేరుకుంటారు సోఫీకి అరవైమైళ్ళ దూరంలో సముద్రపు వడ్డును వేలితో చూపిస్తూ అన్నాడు ముఖేష్.

అక్కడ షీరా అనబడే గ్రామం వుంది. షిరోనా ప్రకృతి సౌందర్యాలను చూడటానికి వేలకొలదీ వస్తారు టూరిస్టులు. వారందరూ ఆ గ్రామ పరిసరాలలోనే విడిది చేస్తారు.

పారిపోతున్న ఆరుగురు వ్యక్తులకు - అంతకంటే మంచి ప్రదేశం మరొకటి దొరకదు.

సర్వర్ ని పిలిచి మరో కాఫీ ఆర్డర్ యిచ్చాడు షాడో. అప్పటికది పన్నెండోసారి కాఫీ ఆర్డర్ యివ్వటం.

కాఫీని సిప్ చేస్తూ సిగిరెట్ వెలిగించుకొని - కుర్చీ వెనక్కువాలి కూర్చున్నాడు. కాష్ కౌంటర్ దగ్గిరికిపోయి టూరిస్ట్ కేంద్రానికి దారి తెలుసుకుంటున్నాడు ముఖేష్.

సిగిరెట్ లోనుంచి వెలువడుతున్న పొగల మాదిరిగానే షాడో హృదయంలో సుడులు తిరుగుతున్నాయి - ఆలోచనలు.

కలకత్తాలో అతి పురాతనమైన కాళికాలయం ఒకటి వుంది. అది పురాణకాలంలో పరమేశ్వరుడిచేత కట్టించబడిందని అంటారు.... ఆ కాళికాదేవి వుత్సవ విగ్రహం మేలిమి బంగారంతో తయారుచేయబడింది. అమూల్యమైన వజ్రవైఢూర్యాలతో అలంకరించబడి వుంటుంది.

పదిరోజుల క్రితం - వున్నట్లుండి మాయం అయిందా వుత్సవ విగ్రహం. పూజారులను గాయపరిచి, ఆరుగురు వ్యక్తులు దాన్ని అపహరించారు. పోలీసుల కళ్ళుకప్పి బోర్డర్లుదాటి బర్మాలో ప్రవేశించారు.

కలకత్తా నగరం అట్టుడికిపోయింది - ఆ వార్త తెలియగానే. అతి ప్రాచీనమైన ఆ వుత్సవ విగ్రహాన్ని తిరిగి సంపాదించ లేకపోతే... ప్రభుత్వం తల్లక్రిందులయ్యే పరిస్థితులు కానవచ్చాయి.

"రాజూ ... ఆరునూరయినా ... నూరు ఆరయినా ... ఆ విగ్రహం మనదేశానికి తిరిగి రావాలి. నువ్వు ఏంచేస్తావో, ఎలా పరిశోధిస్తావో !!" అంటూ ఆర్డరు జారీచేశారు కులకర్ణి.

షాడో ఒక్కడేకాదు...సి.ఐ.బి. స్పెషల్ సెక్యూరిటీ ఫోర్సుకూడా రంగంలోకి దిగింది. మూడురోజులు నిద్రాహారాలు లేకుండా ప్రయత్నించి - విగ్రహం అపహరించిన వారి జాడలను కనిపెట్టారు.

ఆ మరుక్షణం - పగబట్టిన పాముల్లా వెంటబడ్డారు షాడో ముఖేష్ లు. అయినా ఎక్కడికక్కడ అతినేర్పుగా టోకరా యిచ్చి తప్పుకుంటూనే వున్నారు దొంగలు.

షిరోనా టూరిస్ట్ కేంద్రాలకు ప్రపంచంలోవున్న మిలియనీర్లు ఎందరోవస్తారు. అపూర్వమైన ఆ బంగారు విగ్రహానికి కోట్లకొలది డబ్బు ధారపోసి కొనుక్కోగలరు. చేతులు మారకముందే ఆ విగ్రహాన్ని చేజిక్కించుకోవాలి.

"రాజూ ... ఇంకో గంటలో ఒక టూరిస్టూ బస్ బయలు దేరుతుందట." కాష్ కౌంటర్ దగ్గిర్నించే అరిచాడు ముఖేష్.

సిగిరెట్ ని అవతలకు విసిరి వళ్ళు విరుచుకుంటూ లేచాడు షాడో.

2

రాత్రి పదిగంటలు అయింది. దట్టమైన చీకటి పీరా గ్రామాన్ని ఆవరించుకొని వుంది.

గ్రామానికి కొద్ది దూరంలో నాలుగు టూరిస్ట్ హోటల్స్ వున్నాయి. మెర్క్యురీ దీపాలతో మెరిసిపోతున్నాయవి. నిద్రపట్టని టూరిస్టులు హోటల్స్ ముందున్న మైదానంలో తిరుగుతూ వున్నారు.

పన్నెండుగంటలు అవుతుండగా ... గ్రామంలో నుంచి యిద్దరు వ్యక్తులు ఆ మైదానం దగ్గిరికి వచ్చారు.

ఠీవిగా చిన్న కాన్వాస్ ఛైర్ లో కూర్చుని, పైపు కాలుస్తున్న ఓ టూరిస్టుతో అరగంటసేపు మాట్లాడారు.

ఉన్నట్లుండి లేచాడతను. ఎవరో యిద్దరు టూరిస్టులను వెంట బెట్టుకొని ఆ వ్యక్తుల వెంట గ్రామంవైపు బయలు దేరాడు.

గ్రామం మధ్యలో పెద్ద మట్టి బిల్డింగ్ వుంది.

దాని గుమ్మంముందు ఇద్దరు దృఢకాయులు నిలబడి వున్నారు. టూరిస్టులను చూడగానే తలుపులు తెరిచి వారిని లోపలకు పంపించారు. తిరిగి యధాప్రకారం తలుపులు మూసి అక్కడే నిలబడ్డారు.

ఇంటికి మధ్యగా పెద్ద గదివుంది. ఆ గదిలో మరో యిద్దరు వ్యక్తులు కుర్చీలలో కూర్చునివున్నారు.

"అమూల్యమైన భారతీయ కళాఖండం ఒకటి వున్నదని అన్నారు ...ఎక్కడవుంది?" పైపు కాలుస్తున్న టూరిస్ట్ వారిని అడిగాడు.

కుర్చీకిందవున్న ఎయిర్ బాగ్ ని అందుకొని, అందులో వున్న విగ్రహాన్ని బయటికి తీశాడొక వ్యక్తి.

గదిలో వెలుగుతున్న లైటు వెలుగుబడి దేదీప్యమానంగా ప్రకాశించాయి విగ్రహానికి పొదగబడిన వజ్రవైఢూర్యాలు.

టూరిస్టులకళ్ళు చెదిరిపోయాయి.

"మైగాడ్! ఫాబ్యులస్!! ఫెంటాస్టిక్!!! ఎంత? దీని వెల ఎంత?" ఆశ్చర్యంగా అన్నాడొక టూరిస్టు.

అదే సమయంలో బిల్డింగ్ బయటనుంచి పెద్ద కేక వినిపించింది. ధన్ మని పేలిందొక రివాల్వర్. ఆ నిశబ్ద నిశీధిలో దారుణంగా ప్రతిధ్వనిస్తోందా మ్రోత.

వెంటనే విగ్రహాన్ని ఎయిర్ బాగ్ లో పెట్టేశాడొక వ్యక్తి అతని సహచరుడి చేయిపట్టుకొని, మరో గదిలోకి పారిపోయాడు - ఎయిర్ బాగ్ తో సహా.

అదే సమయంలో ముందు తలుపులు భళ్ళున తెరుచు కున్నాయి. బయట నిలబడిన నలుగురు దృఢకాయుల్ని పడగొట్టి లోపలకు పరిగెత్తుకొచ్చారు షాడో ముఖేష్ లు.

"ఎక్కడ! విగ్రహం ఎక్కడ?" రివాల్వర్ ని ఒక టూరిస్ట్ కేసి గురిపెట్టి అడిగాడు ముఖేష్.

"ఇది అక్రమం! ఈ బెదిరింపులు చట్టవిరుద్ధం!!" మరుక్షణం షాడో చేతిలోని రివాల్వర్ అతని ముఖం మీద వాలింది. ఆ వ్యక్తి ముందు పళ్ళు నాలుగు వూడి కిందపడ్డాయి.

"దొంగ సొమ్మును కొని, విలాసాలకు వాడుకునే నీ లాంటి వాళ్ళకు చట్టం అనే పదానికి అర్ధంకూడా తెలుసా? మరొక్క మాట మీ నోటినుంచి వెలువడితే, మీ ప్రాణాలు మీవి కాకుండాపోతాయి. చెప్పండి...విగ్రహం ఎక్కడ?" గర్జించాడు షాడో.

అప్పుడే ... పక్క గదిలోనుంచి చిన్న అలికిడి వినవచ్చింది. "రాజు!" అని అరిచాడు ముఖేష్. వెంటనే అటు దూకాడు షాడో వాళ్ళు... పక్కగదిలోకి వెళ్ళేసరికి... అక్కడినుంచి బయటికి పారిపోతూ కనిపించారు యిద్దరు వ్యక్తులు. బరువైన విగ్రహంవున్న ఎయిర్ బాగ్ ఒక వ్యక్తి భుజాలకు వ్రేలాడుతున్నది.

"రాజు! ఈసారి వీళ్ళను మన కళ్ళ ముందునుంచి పోనీయగూడదు." బిల్డింగ్ బయటకు పరుగుతీస్తూ అన్నాడు ముఖేష్.

షాడో సమాధానం యివ్వలేదు. రివాల్వర్ ని రెడీగా పట్టుకొని అతి వేగంగా అతన్ని అనుసరించాడు.

* * *

కనుచీకటి పడింది...అంతవరకూ శబ్దంగావున్న షిరోనా దుర్గమారణ్యం, నెమ్మదిగా నిద్రలేవటం ప్రారంభించింది. గూళ్ళను చేరుకుంటున్న పక్షుల అరుపులు, వేటకు బయలుదేరుతున్న క్రూరమృగాల గర్జనలు మెల్లిగా శృతిమించటం ప్రారంభించాయి.

దట్టంగా పెరిగివున్న పొదలలో దారి చేసుకుంటూ ముందు నడుస్తున్న ముఖేష్ 'రాజు!' అని పిలిచి, ఎక్కడివాడక్కడ ఆగిపోయాడు.

వెనుక వస్తున్న షాడో రెండంగల్లో అతన్ని సమీపించాడు. ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూడగానే ఆశ్చర్యం అతన్ని నిలువెల్లా ఆవరించింది.

ఎదురుగా చిన్న ఖాళీ స్థలంవుంది. అక్కడ బ్రహ్మాండమైన మర్రిచెట్టు ఒకటి వుంది. షిరోనా అరణ్యాలలో మర్రిచెట్లు వుండవు. ఉండకూడదు వృక్షశాస్త్రం ప్రకారం. కాని అది మర్రిచెట్టే! అందులో సందేహం ఏమీలేదు.

ఆ చెట్టుకింద చిన్న గుడిశెవుంది. ఆ గుడిశెముందు ఒక వృద్ధురాలు కూర్చుని వుంది.

షిరోనా దేశీయులు ధరించే దుస్తులు ధరించివున్నదామె. చేతులకు వెండి కడియాలు, మెడలో రంగుపూసలు...చెవులకు

యిత్తడి కమ్మలు, తెల్లగా నెరిసి భుజాలమీదికి వాలుతున్న శిరోజాలతో, ఎంతో హుందాగా కనిపిస్తుంది.

"అవ్వా! ఇటుగా వచ్చారు యిద్దరు వ్యక్తులు. నువ్వు వారిని చూశావా? ఎటుపోయారో చెప్పగలవా?" అడిగాడు ముఖేష్ వినయంగా.

తలఎత్తి వారిద్దరినీ పరీక్షగా చూసి నవ్విందామె.

"వాళ్ళని మీరు పట్టుకోలేరు" అన్నది.

"ఎందుకని? రెక్కలు సంపాదించుకొని ఎగిరిపోయారా లేక యీ నట్టడివిలో నరులకంట పడకుండా దేవతల సహాయాన్ని పొంద గలిగారా?" అడిగాడు ముఖేష్.

"అంత కోపందేనికి నాయనా? ఈ షిరోనా అరణ్యాలల్లో అడుగుపెట్టిన వారు తిరిగి ప్రాణాలతో బయటపడరన్న విషయం మీకు తెలిసే వుంటుంది. మనుషుల్ని విరుచుకుతినే వృక్షాలు, మతి భ్రమకలిగించే పుష్పాలు ఆధునిక యుగపు అంతరంగాలకు అర్థం కాని మరెన్నో వివరాలు ఈ అరణ్యంలో వున్నాయి. నా మాట వినకుండా వెళ్ళారు మీరు వెతుకుతున్న వ్యక్తులు. ఈ సరికి ఏదో ఒక ప్రమాదంలో చిక్కుపడి వుంటారు ... మీరు అదే దుర్గతికిలోను కాకండి." అన్నదామె.

"ఎటు వెళ్ళారవ్వా? ఇటేనా?" చేత్తో అరణ్యంలోకి చూపిస్తూ అడిగాడు షాడో. అతనివంక సీరియస్ గా చూసిందామె." మనుషుల్ని చంపటం నీకు బాగా అలవాటయినట్లుంది. ప్రాణాలకు వెరిచి పారిపోతున్నవారిని, పట్టుకొని చంపటానికేగదా నువ్వు యింత ఆత్రుతపడుతున్నది?" అని అడిగింది. రివాల్వర్ ని పాంటు జేబులో పెట్టుకొని, సిగిరెట్ వెలిగించుకుంటున్న షాడో ఆ మాటలకు గంభీరంగా నవ్వాడు.

"అవ్వా! చేయరాని నేరంచేసి, పారిపోయివచ్చారు వారు. నా దేశీయులు అతి పవిత్రంగా భావించి పూజలు సల్పే దేవతా విగ్రహాన్ని దొంగిలించి, మా దైవానికి, మా దేశానికి అపచారం చేశారు. అందుకు శిక్ష వారు అనుభవించి తీరాల్సిందే." అన్నాడు.

"తన విగ్రహాన్ని దొంగిలించిన వారిని మీ దేవత కూడా ఏమీ చేయకుండా వూరుకుంది. ఆమె చేయవలసిన పనిని, సామాన్య మానవుడివి నువ్వు చేయటం న్యాయం అనిపించుకోదు. అన్యాయం అవుతుంది. రాక్షసత్వం అనిపించుకుంటుంది."

"అవ్వా! న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు మొదలైన వాటిని గురించి నీతో వాదించే ఓపిక నాకులేదు. మా దైవం మా దేశ ప్రజల బాగోగులు చూడటంలో బిజీగా వున్నది. ఇటువంటి నేరాలను రూపుమాపేటందుకు నా లాంటి సేవకులు ఎంతోమంది వుండగా ఆమె కలగచేసుకోవాల్సిన అవసరం ఏముంది?"

పకపకా నవ్వింది వృద్ధురాలు. "నీ సంజాయిషీ చాలా వింతగా వుంది. ఇంతవరకూ ఇటువంటి నిర్వచనం నేను ఎవరినోటా వినలేదు" అంటూ.

"ఇప్పుడు వింటున్నావ్ గదా! అవ్వ ప్లీజ్ ... ఆ దుర్మార్గులు ఎటుపోయారో చెప్పు ... తిరిగి వచ్చేటప్పుడు నాలుగు రోజులు యిక్కడేవుండి నీ ప్రశ్నలకు తీరికగా సమాధానాలు యిస్తాం." బ్రతిమాలుకున్నాడు ముఖేష్.

"మీ పట్టుదలే మీదికాని, నా మాటలు వినదలుచుకోలదన్న మాట! సరే! మీ నొసటి వ్రాతను మార్చగల శక్తి నాకు లేదు... పొండి.. చెట్లలోకి వెళ్ళి ... కనిపించిన కాలిబాటను అనుసరించండి." అంటూ లేచి గుడిశెలోకి వెళ్ళిపోయింది వృద్ధురాలు.

"అవ్వా! థేంక్యూ వెరీమచ్!! నీ ఋణం యీ జన్మలో తీర్చు కోలేం. నీ సహాయాన్ని మరు జన్మలో కూడా మరిచిపోలేము ..." అంటున్న ముఖేష్ చేయి పట్టుకొని చెట్లలోకి లాక్కుపోయాడు షాడో.

3

భయంకరమైన ఒక గర్జన, షిరోనా దుర్గమా రణ్యాన్ని దద్దరిల్ల చేసింది. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు ముఖేష్. ఎదుట వున్న చితుకులమంట అణగారిపోయివుంది. పక్కనే వుండాల్సిన షాడో కనిపించకపోయేసరికి ముఖేష్ గుండెలు ఝల్లుమన్నాయి.

"రాజూ!" అన్నాడు బిగ్గరిగా.

అదే సమయంలో అతి దాఋణంగా వినవచ్చిందా గర్జన, అతి దగ్గరలోనుంచి.

ఠీవిగా అడుగులువేస్తూ పొదల మధ్యనుంచి ముఖేష్ ముందుకు వచ్చిందొక బ్లాక్ లియోపార్డ్. రేడియంలా మెరుస్తున్నాయి దాని కళ్ళు పొడుగాటి తోకను నేలకేసి బాదుతూ, ముందరి పంజాలతో నేలను గీరుతూ, తెల్లగా తళతళా మెరుస్తున్న కోరలను బయటపెట్టి ముఖేష్ వంక తీవ్రంగా చూసిందది.

ఎలా వున్నవాడు అలాగే బిగుసుకుపోయాడు ముఖేష్. అది ఎటాక్ చేయటానికి సిద్ధంగా వుంది. తను ఏమాత్రం కదిలినా వెంటనే ఎగిరిమీదికి దూకుతుంది.

దూకనే దూకిందది. మరోసారి దాఋణంగా గర్జించి గాలిలోకి ఎగిరింది. వెంటనే పక్కకు దొర్లాడు ముఖేష్. మెరుపులా పాంటు జేబులోనుంచి రివాల్వర్ ని బయటికి తీశాడు.

అదే సమయంలో చెట్టుమీదినుంచి సరిగ్గా లియోపార్డ్ మీదికి దూకాడు షాడో. అతని చేతిలో వున్న డాగర్ దాని డొక్కలో దిగబడింది.

వికృతంగా అరిచి, ఎగిరి అవతల పడింది లియోపార్డ్ .

మరుక్షణం భీకరంగా గర్జించింది ముఖేష్ చేతిలోని రివాల్వర్. లియోపార్డ్ ఎడమ పిక్కలో దిగబడింది దాని బుల్లెట్.

బాధతో ఎగిరి గంతులువేసిందా అడవి జంతువు. ఉన్నట్లుండి వెనుతిరిగి పొదలలోకి పారిపోయింది.

"ముఖేష్! దాన్ని చంపకపోతే చాలా ప్రమాదం... దెబ్బతిన్న లియోపార్డ్ పాముకంటె దాఋణంగా పగపడుతుంది. ఈ అరణ్యంలో మనం వున్నంతకాలం అది మన వెనుకే వుంటుంది." అంటూ డాగర్ ని బిగించి పట్టుకొని లియోపార్డ్ వెనుకపడ్డాడు షాడో.

"అసలే భయంవేసి నేను ఏడుస్తుంటే, నన్ను వదిలి నువ్వు చెట్టుమీదికి ఎందుకుపోయావ్?" షాడోని అనుసరిస్తూ కోపంగా అన్నాడు ముఖేష్.

"మన స్నేహితులు యీ చుట్టుపక్కలే వుండాలి... మన మాదిరిగానే చితుకులమంటలు వేసుకొని వుంటారు... చూడటానికి చెట్టు ఎక్కాను..." సమాధానం యిచ్చాడు షాడో.

అంతలోనే ముందునుంచి లియోపార్డ్ గర్జన మరోసారి వినిపించింది. దాన్ని అనుసరించి, కెవ్వుమన్న కేక గూడా వినవచ్చింది.

శరవేగంతో అటువెళ్ళారు స్నేహితులు యిద్దరూ. పాతిక అడుగులు వేయకముందే కనిపించాడు, కెవ్వుమన్న మనిషి.

పారిపోతున్న లియోపార్డ్, అతన్ని పంజాలతో రెండుగా చీల్చి మరీ పారిపోయింది. అతని సహచరుడు ...దూరంలో పరుగులు పెడుతున్నాడు.

ప్రాణభయంతో పారిపోతున్నా, విగ్రహంవున్న ఎయిర్ బాగ్ ని మాత్రం వదిలిపెట్టటంలేదు. అది అతని భుజానికి ప్రేలాడుతూనే వుంది.

లియోపార్డ్ ఏమయిందో కనిపించలేదు. అసలు దాన్ని గురించి మర్చిపోయారు షాడో ముఖేష్ లు. ఎదురుగా వున్న వ్యక్తిని చూడగానే అది అరణ్యం అన్న విషయం కూడా మరుపుకు వచ్చింది వారికి.

"లొంగిపో! పారిపోవటానికి ప్రయత్నించి ప్రయోజనం లేదు. ముక్కోటి దేవతలు వచ్చి అడ్డుపడినా సరే - యీసారి నిన్ను వదలం..." బిగ్గరగా అరిచాడు ముఖేష్.

ఆ మాటలు విని మరింత వేగంగా పరిగెత్తసాగాడా వ్యక్తి.

బ్లడీఫూల్! నీ పాడు వుపన్యాసాలు నువ్వూనూ—" పొదల మీదినుంచి జంప్ చేసి ముందుకు సాగుతూ విసుకున్నాడు షాడో.

ఉన్నట్లుండి... ఎగిరి పక్కకు దూకాడు ముందున్న వ్యక్తి. "రక్షించండి ... రక్షించండి" అని అరుస్తూ వెనుతిరిగాడు.

చటుక్కున ఆగిపోయాడు షాడో. ముఖేష్ భుజం పట్టుకొని బలవంతంగా ఆపేశాడు.

నాలుగు అడుగులు యివతలికి వేశాడా వ్యక్తి, అంతే అంత చీకటిలోనూ ఒక పెద్ద చెట్టు కొమ్మ క్రిందికి దిగి అతన్ని ఆకుల మధ్య యిరికించుకోవటం చూశారు షాడో ముఖేష్ లు.

బాధతో వికృతంగా అరుస్తున్నాడా వ్యక్తి. అతని భుజానికి వ్రేలాడుతున్న ఎయిర్ బాగ్ జారి నేలమీద పడిపోయింది. చెట్టుకొమ్మ అతన్ని గాలిలోకి ఎత్తింది.

"రాజు మనుషుల్ని తినే వృక్షాలు!!!" ఆశ్చర్యంగా అన్నాడు ముఖేష్.

జేబుల్ని తడుముకుంటున్నాడు షాడో. లైటర్ ని బయటికి తీసి వెలిగించాడు. అతని వుద్దేశ్యాన్ని అర్థం చేసుకున్న ముఖేష్ ఆ వెలుగులో ఒక పొదను విరిచి ఆకుల్ని నేలమీద గుట్టగా పోశాడు.

లైటర్ తో మంట చేసి నాలుగు కొమ్మల్ని కాగడాలలా వెలిగించి వాటితో ముందుకు వెళ్ళారు.

నాలుగు నిలువుల ఎత్తున వ్రేలాడుతున్నాడా వ్యక్తి... అతని రక్తం బొట్లుబొట్లుగా నేలమీదికి రాలుతున్నది. క్రిందవున్న పొదలు నాలుకలు జాచినట్లు ఆకులను ముందుకు జాపి ఆ రక్తపు బొట్లను ఆస్వాదిస్తున్నాయి.

షాడో ముఖేష్‌లు ఆ పొదల మధ్యకు వెళ్ళగానే - తాచుపాములు పడగలు ఎత్తినట్లు లేచి నిలబడ్డాయి కొమ్మలు.

దభేలుమని శబ్దం చేస్తూ కిందపడ్డాడు - పైన కొమ్మల్లో యిరుక్కుపోయిన మనిషి. కాగడా వెలుగులో అతని ఆకారాన్ని చూసి అదిరిపోయారు స్నేహితులు యిద్దరూ.

రక్తమాంసాలు లేని ఎముకల గూడులా తయారైనాడతను.

ఆకులు గలగలలు విని తలఎత్తి చూసిన ముఖేష్ "రాజూ!" అని అరిచి నేలమీదకు వంగాడు.

మరోసారి కిందికి దిగుతున్నదా కొమ్మ... పక్కన ఉన్న పొదలు ముందుకు జరుగుతున్నట్లు కనిపిస్తుంది.

షాడో నెత్తి మీదకు వచ్చింది చెట్టుకొమ్మ. ఆకుల్ని వెడల్పు చేసి అతని తల చుట్టూ చుట్టబోయింది.

చేతిలో వున్న కాగడాను ఎత్తి ఆకులమధ్య గిరగిరా తిప్పాడు షాడో. వళ్ళు కాలిన మనిషి మూలిగినట్లు, వికృతమైన శబ్దం వినవచ్చింది, చటుక్కున పైకి పోయిందా చెట్టుకొమ్మ ఆకులు కాలి చర్మం కాలుతున్నట్లు కమురుకంపు వెలువడింది.

క్రిందికి వంగిన ముఖేష్ కిందవున్న ఆకులను గుట్టచేసి మంట వేశాడు.

కాగడాను పక్కనేవున్న పొదలలోకి దూర్చి వాటిని అగ్నిమయం చేశాడు. అరుపులు ... కేకలు ...ఏడుపులు...పెడబొబ్బలు... మొదలైన వికృతస్వరాలన్నీ వారికి వినిపించాయి.

కొమ్మలను గాలిలో వూపుతూ మరింత వేగంగా ఆకులను కిందికి దించిందా మనుష్యులను విరుచుకుతినే వృక్షం. మంటలను లక్ష్యపెట్టినట్లు కనిపించటంలేదు.

"ముఖేష్ బాగ్ తీసుకో... పారిపోకపోతే మనంకూడా అస్థి పంజరాలమౌతాం ..." కాగడాను గాలిలో తిప్పుతూ హెచ్చరించాడు షాడో.

కిందపడి వున్న ఎయిర్ బాగ్ ని తీసుకొని భుజానికి తగిలించుకున్నాడు ముఖేష్. అడ్డుపడపోయిన పొదలను కాగడాతో బెదిరించి యివతలకు వచ్చాడు.

చెట్టుకొమ్మ ఒకటి షాడో మీదకు వాలింది... అతని ఎడమ భుజాన్ని పళ్ళతో కరిచిపట్టినట్లు ఆకులతో అదిమి పట్టింది.

పదునైన కత్తులు భుజంలో దిగబడినట్లు ఫీల్ అయ్యాడు షాడో. వదిలించుకుందామని చూశాడు లాభం లేకపోయింది. శరీరంలో వున్న, రక్తాన్నంతా శరవేగంతో పీలుస్తున్నాయా ఆకులు ... త్వరపడక పోతే ప్రమాదం తప్పదని గ్రహించి కాగడాను భుజానికి చుట్టుకున్న

ఆకులకేసి అదిమాడు షాడో. కొంచెం పట్టు సడలింది. ఇంతలో పక్కనుంచి మరికొన్ని ఆకులు కుడిభుజాన్ని తాకాయి.

వెంటనే కిందికి జారాడు షాడో. పాములా పాకుతూ శరవేగంతో పొదలను దాటి యువతలకి వచ్చిపడ్డాడు.

సుడిగాలికి అల్లల్లాడినట్లు, శివమెత్తిన మనిషి ఎగిరి గంతులు వేసినట్లు ప్రచండంగా వూగిపోతున్నదా వృక్షం.

"రాజూ...దీని వరస చూస్తుంటే మన వెంటబడి తరిమి కొట్టేటట్లువుంది..." అంటున్నాడు ముఖేష్.

అతని మాటలు పూర్తి కాకముందే - కదలనే కదిలింది ఆ వృక్షం. కీచుధ్వనులతో పొదలను దాటి ముందుకు వచ్చాయి దాని కొమ్మలు.

మరుక్షణం వెనుతిరిగి పరుగు అందుకున్నారు స్నేహితులు యిద్దరు. అడ్డు వచ్చిన పొదలను విరగతొక్కుతూ వెనక్కి వచ్చారు.

ఒక పొదనుంచి జంప్ చేసిన ముఖేష్ "రాజూ" అని అరిచి పక్కకు పడ్డాడు.

ఎక్కడి వాడక్కడ ఆగిపోయాడు షాడో. కిందపడిన ముఖేష్ ని పట్టుకోవటానికి భయంకరంగా నోరు తెరిచి - తలను ముందుకు జాపింది ఒక కొండచిలువ.

నలుగుర్ని ఒక్కసారే మింగగలదా కొండచిలువ. పెద్ద గుహలా కనిపిస్తోంది దాని నోరు.

మెరుపులా బెల్టు వెనుక వున్న రివాల్వర్ ని లాగాడు షాడో. దాని నోటికి గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాడు.

రివాల్వర్ మ్రోతతో దద్దరిల్లిపోయింది షిరోనా అరణ్యం.

బాధతో బుసలుకొట్టింది కొండచిలువ. తోకనెత్తి షాడో తలమీద బాదింది. ఎగిరి పక్కకు దూకాడు షాడో. కాని తోక అతని తొడలకు తగిలింది. తొడఎముకలు విరిగినట్లు అనుభూతి కలిగింది. కాళ్ళు చచ్చుపడినట్లు - నిలబడలేక ముందుకు పడిపోయాడు.

మరింత భయంకరంగా నోరుతెరిచి ముందుకు వంగిందా కొండచిలువ. ఈసారి కిందవున్న ముఖేష్ - తన రివాల్వర్ ని ప్రయోగించాడు. కొండచిలువ కన్ను ఒకటి బుల్లెట్ దెబ్బకు చిన్నాభిన్నమయింది.

పిచ్చి ఎక్కినట్లు పొదలను విరగతోస్తూ పారిపోయిందది.

ముందుకు పడిన షాడో ... లేవటానికి ప్రయత్నించాడు. కత్తులతో పొడిచినట్లు కలుక్కుమంది కుడితొడ. బాధతో కళ్ళు బైర్లుక్రమ్మి మళ్ళీ నేలమీదికి వాలిపోయాడు.

అరణ్యమంతా గందరగోళం అయినట్లు - వికృత శబ్దాలు వినిపిస్తున్నాయి " రాజు ... కమాన్ రాజు !!" అంటూ చేయి అందించి షాడోను లేపి నిలబెట్టాడు ముఖేష్.

షాడో ఎడమచేయి చచ్చుపడినట్లు వ్రేలాడబడిపోయింది కుడితొడ విరిగిపోయినట్లు - కాలు నేలకు ఆనించటం చేతకావటం లేదు.

పళ్ళబిగువున ఆ బాధలను భరిస్తూ - ముఖేష్ భుజాలమీద చేయివేసి కుంటుకుంటూ బయలుదేరాడు షాడో.

పది అడుగులుకూడా వేయకముందే - భీకరమైన గర్జన వారిని వులిక్కిపడేటట్లు చేసింది.

ఎదురుగావున్న పొదలోనుంచి ఎగిరి వారిమీదికి దూకింది అంతకు ముందు వారిచేత గాయపడిన బ్లాక్ లియోపార్డ్.

* * *

చేతిలోవున్న రివాల్వర్ ని వుపయోగించటానికి కూడా వీలులేక - ఎక్కడివాడక్కడే నిలబడిపోయాడు ముఖేష్.

ఎడమ కాలిమీద బరువునుమోపి - ఎగిరి లియోపార్డ్ మీదికి దూకాడు షాడో. గాలిలోనే దాని గొంతుపట్టుకొని కిందపడ్డాడు. దెబ్బతీయటానికి ఎడమచేయి పని చేయటం లేదు. కుడిచేతి పట్టును సడలిస్తే - అది లేచి తిరగబడుతుంది.

అలాగే దాన్ని కదలకుండా నేలమీద బిగించిపట్టాడు. జారిపోతున్న ఎయిర్ బాగ్ ని ఎడమచేతిలో పట్టుకొని - లియోపార్డ్ తలమీదికి దూకాడు ముఖేష్.

చటుక్కున తలను పక్కకు లాక్కున్నదది. ముఖేష్ తల్లకిందులుగా ముందుకుపడ్డాడు. మరుక్షణం - చెవులు చిల్లులు పడేలా గర్జిస్తూ - శరీరంలోని బలాన్నంతా కూడగట్టుకొని లేచిందది.

చేతిలోని రివాల్వర్ ని దాని నోటిలోకి దోపి, ట్రిగ్గర్ నొక్కాడు ముఖేష్. రివాల్వర్ బారెల్ లోనుంచి నీలం రంగుమంటలు వెలువడ్డాయి. బుల్లెట్ లియోపార్డ్ గొంతులోనుంచి కడుపులోకి పోయి, వెన్నుమీది నుంచి వెలుపలికి వచ్చింది.

ఆఖరిసారిగా అతి దారుణంగా గర్జించిందది. జారిపోతున్న శక్తినంతా కూడతీసుకొని పక్కనే వున్న పొదల లోకి దూకింది.

దాని మెడచుట్టూ చేతులు చుట్టివున్న షాడో - దానిముందు కాళ్ళను, తొడలతో పెనవేసి కదలకుండా పట్టివున్న ముఖేష్ - దానితో పాటు లేచి పొదల్లో పడ్డారు.

రాతిలాంటి వస్తువేదో - వారి తలలకు తగిలి ఖంగుమని శబ్దం అయింది. ఏదో అంతు తెలియని అగాధంలోకి జారిపోతున్నట్లు అనిపించి - నిలదొక్కుకోవటానికి ప్రయత్నించారు. ఫలితం

లేకపోయింది. ఏమి జరుగుతున్నదో అర్థం చేసుకునే లోపుగానే వారికి స్పృహ తప్పిపోయింది.

4

సూర్యకిరణాలు సూటిగావచ్చి ముఖంమీద పడటంతో వులిక్కిపడి కళ్ళు తెరిచాడు ముఖేష్ . ఆశ్చర్యంగా చుట్టూ చూస్తూ లేచి కూర్చున్నాడు.

పచ్చటి మైదానంలో ఒక పొదచాటున పడివున్నాడతను. అంతకుముందు చుట్టుముట్టి బెదిరించిన అడవి జంతువులుగాని, అరణ్యంగాని అస్సలు కంటికి కనిపించటంలేదు.

అప్రయత్నంగా ఎయిర్ బాగ్ కోసం వెతికాయి ముఖేష్ కనులు.

అగాధంలాంటి గోతిలో పడిపోయేటప్పుడు - గట్టిగా పట్టుకునే వున్నాడు దానిని. ఇప్పుడు కనిపించటంలేదు ఎక్కడో జారి పోయిందది.

బాగ్ ని వెతుకుతున్న కళ్ళకు షాడోకూడా కనిపించక పోయేసరికి ముఖేష్ శరీరం జలదరించింది.

"రాజూ!" అని అరుస్తూ లేచి నిలబడ్డాడు.

"చెవికోసిన మేకలా అలా అరిచి గోల చేస్తావెందుకు? నెమ్మదిగా పిలవలేవూ?" అంటూ వినవచ్చింది షాడో కంఠం.

గిరుక్కున అటు తిరిగాడు ముఖేష్. వంద అడుగుల దూరంలో చిన్న నీటిగుంట వుంది. వంటికి అంటివున్న దుమ్మూధూళిని వదిలించుకుంటున్నాడు షాడో - అక్కడ.

"రాజూ" బాగ్ మాయమయింది మన ప్రయాణం మళ్ళీ ఇండెఫినిట్ గా కంటిన్యూ అయింది." అన్నాడు ముఖేష్.

బాగావున్న కుడిచేతిని గుంటకు ఎడమ వైపునవున్న బురద నేలకేసి వూపాడు షాడో.

ఆ బురదలో బాగ్ యీడ్చబడినట్లు జాడలు కనిపిస్తున్నాయి. ఇద్దరు మనుష్యుల పాదముద్రలు బాగ్ జాడల పక్కనే వున్నాయి.

"మర్రి చెట్టుకింది వృద్ధురాలి మాటలు యధార్థం అయ్యాయి. మనకు అర్థంకాని వింతల్ని చూడబోతున్నాం. ముళ్ళపొదలో పడిన మనం - అగాధంలోకి దొర్లటం - ఎక్కడో ఒకచోట అంతం కావాల్సిన అగాధం - మనల్ని యీ మైదానంలోకి చేర్చటం - చాలా గమ్మత్తుగా వుంది ... నీటిగుంట దగ్గిరికివచ్చి బాగ్ ని మాత్రం చూశారు ఎవరో... పొదచాటునవున్న మనల్ని గమనించకుండా దాన్ని తీసుకు వెళ్ళిపోయారు." బురద నేలమీది జాడలకు అర్థాన్ని తెలియచేశాడు షాడో.

"ఇదెక్కడి ఖర్మరా బాబూ ... ఆ ముసల్ది మన జానపద కథల్లో కనిపించే మంత్రగత్తె మాదిరిగా వున్నది ... కొంపతీసి మనల్ని ఏ

మాంత్రికుడి దగ్గిరికో పంపించటం లేదుకదా!" అంటూ నీటిగుంటలో దిగాడు ముఖేష్.

షాడో ఎడమచేయి పనిచేయటంలేదు. కుడికాలు నేలమీద ఆనించటానికి వీలుకాకుండా వుంది.

అలాగే కుంటుకుంటూ పొద దగ్గిరికిపోయి ... పొడుగాటి కర్రలను రెంటిని విరిచాడు. వాటి తలలమీద డాగర్ తో నున్నగా చెక్కి వూతకర్రల మాదిరి తయారు చేశాడు.

నీళ్ళు కారుతున్న దుస్తులతో నీటిగుంటలోనుంచి బయటికి వచ్చాడు ముఖేష్ . ఊతకర్రల సాయంతో మెల్లిగా అడుగులువేస్తూ బాగ్ ని అపహరించుకుపోయిన అడుగు జాడల్ని అనుసరించటం ప్రారంభించాడు షాడో.

ఆకలివేస్తోంది దాహంతో నాలుక పిడచగట్టుకు పోతుంది. ఈ పాడుమైదానం ఎన్నిరోజులకు అంతమౌతుందో తెలియదు. మనుష్యుల ముఖాలుచూసి చాలాకాలం అయింది. మనదేశం ఎప్పుడు తిరిగిపోతామో! ఆవలా విగ్రహం మనకు తిరిగి దొరుకుతుందో, దొరుకదో!!" గ్రామఫోన్ రికార్డులా కామెంట్స్ చేస్తూ అనుసరించాడు ముఖేష్.

తనకు శ్రమ తెలియకుండా వుండటానికి ముఖేష్ అలా గోల చేస్తున్నాడని షాడోకి తెలుసు. నిద్రాహారాలు లేకుండా ఎన్నిరోజులు

వుండమన్నా వుండగల మొండి మనిషి ముఖేష్. మొదలుపెట్టిన పనిని పూర్తిచేసేదాకా విశ్రాంతి అనే మాటను మర్చిపోయే మనస్తత్వం అతనిది.

రెండురోజులు కొనసాగింది వారి ప్రయాణం. రెండవరోజున వారు అనుసరిస్తున్న జాడలు అదృశ్యమయ్యాయి. మూడవరోజున మైదానం అంతం అయింది. మైదానం చివరవున్న చెట్లతోపును దాటగానే రెండుమైళ్ళ దూరంలో, బ్రహ్మాండమైన కోట ఒకటి వారి ఎదుట ప్రత్యక్షమయింది.

"ఇదెక్కడి గొడవరా నాయనో! ఆ కోటలో రాక్షసులే వున్నారో, మాంత్రికులే వున్నారో - లేక అందమైన రాజకుమార్తెలు మనకోసం ఎదురుతెన్నులు చూస్తున్నారో ..." అంటూ ఆశ్చర్యం నటించాడు ముఖేష్!" అతని చేతులు మాత్రం - అప్రయత్నంగా పాంటు జేబులో నుంచి రివాల్వర్ ని తీసి బుల్లెట్లను సరిచూసుకున్నాయి.

5

ముఖేష్ మాటలు పూర్తిగా కరెక్టు కాకపోయినా ... కొంతవరకూ నిజం అయ్యాయి. బ్రహ్మాండమైన కోట అది. లోపల అందమైన పట్టణం వుంది. రంగు రంగుల దుస్తులు ధరించిన పౌరులు - తమ తమ పనులమీద హడావుడిగా తిరుగుతున్నారు వీధుల్లో. వీధుల వెంబడి నీట్ గా అమర్చిన అంగళ్ళు ... వాటిలోని వస్తువులు - వాటిని అమ్మేవారు, కొనేవారు ... ఈ కాలంనాటి వారు కాదు.

"రాజు ... మనం గతంలోకి అడుగుపెట్టాం ... ఈ సీనరీ అంతా చూస్తుంటే - మనం విక్రమార్కుడి కాలంలోకి వచ్చామని అనిపిస్తుంది." షాడో చెవిలో గుసగుసలాడాడు ముఖేష్.

మౌనంగా తలవూపి ముందుకు అడుగువేశాడు షాడో.

వీధుల్లోని వారు వారిద్దరినీ గమనించి, ఆశ్చర్యంగా చూడసాగారు. అక్కడి వారివేషాలకు, షాడో ముఖేష్ ల వేషాలకు అసలు పోలికలేలేవు. వారు ధోవతులు అంగీలు ధరించివున్నారు భుజాలదాకా వేలాడే వెంట్రుకల్ని వెనక్కి ముడివేసుకొని వున్నారు చేతులకు బంగారు కడియాలు, చెవులకు బంగారు రింగులు వున్నాయి.

షాడో ముఖేష్ ల పాంటు షర్టులు, బూట్లు, ముఖం మీదికి చెదిరిపడే మోడ్రన్ హెయిర్ స్టయిల్ - అక్కడివారికి వింతగా కనిపిస్తున్నాయి.

పెద్దగుంపు తయారయింది. స్నేహితులిద్దరి వెనుక. పగటి వేషగాళ్ళను చూడటానికి ఎగబడిన పిల్లల్లాగా అనుసరించసాగారు అక్కడివారు.

ఒక పళ్ళ దుకాణం ముందు ఆగిపోయాయి ముఖేష్ పాదాలు.

"ఆకలి రాజు ... ఆకలి!" అన్నాడు షాడోవంక దీనంగా చూస్తూ.

దుకాణం ముందువున్న మట్టి అరుగుమీద కూర్చున్నాడు షాడో. ముఖేష్ పళ్ళదుకాణంలోవున్న పడుచుపిల్లను సమీపించాడు.

"ఏం కావాలి?" అన్నదామె ఆశ్చర్యంగా అతనివంక చూస్తూ.

ముఖేష్ గొంతులో పచ్చివెలక్కాయ పడింది.

ఆమె మాటలు అతనికి అర్థంకాలేదు. షాడోవంక చూశాడు ప్రశ్నార్థకంగా.

"విక్రమార్కుడి కాలంలోకి వచ్చామని నువ్వేగా అన్నది- సంస్కృతాన్ని ట్రై చెయ్యి." అన్నాడు షాడో.

"కాదు రాజు ... ఇది సంస్కృతంకాదు."

"అయితే దేవనాగరిలో మాట్లాడు."

"అలా చెప్పు ... ఎక్కడో విన్నట్లువుందే అని తల పగలకొట్టుకుంటున్నా ... దేవనాగరిలో మాట్లాడుతున్నదన్నమాట యీ బొమ్మ ... అమ్మా ... ఆ చక్రకేళీ ఫలముల వెలఎంత చెప్పమ్మా?" అంటూ సాగదీశాడు ముఖేష్ - దేవనాగరిలో అందంగా నవ్విందా పడుచుపిల్ల. చక్రకేళీ గెలను కిందికి దించుతూ "ఏ వూరు మనది?" అని అడిగింది.

కంగుతిన్నాడు ముఖేష్. "రాజు ... కాలం మారినా ... ఈ ప్రశ్నలు మారలేదు. షిరోనా అరణ్యాలలో పడిన మనం ... మన దేశానికి

చెందిన వాతావరణంలోకి ఎలా రాగలిగాం? ఎక్కడి షిరోనా - ఎక్కడి దేవనాగరి!! ఏమిటీ ఇంద్రజాలం?" అన్నాడు సీరియస్ గా.

"ముఖేష్ ... ఏమిటి, ఎందుకు అన్న విషయాలను గురించి ఆలోచించకూడదు యీ సమయంలో. ఆలోచించినకొద్దీ అన్ని అవకతవకగానే కనిపిస్తాయి ముందు మనం మన దేవీ విగ్రహాన్ని వెతికి పట్టుకోవాలి. అది మన చేతికి చిక్కిన మరుక్షణం- ఆలోచిద్దాం- యీ సమస్య లకు సమాధానాలను. అంతవరకూ మనంకూడా విక్రమార్కుడి కాలంలోని వాళ్ళమే ... " అన్నాడు షాడో.

చక్రకేళీలను కోసి, వారివంక భయంగా చూస్తున్నదా పడుచుపిల్ల. వారి సంభాషణ ఆమెకు అర్థం కావటంలేదు.

"వెల ఎంత ?" జేబులోనుంచి వాలెట్ ని తీస్తూ అడిగాడు ముఖేష్.

"పరదేశీయుల మాదిరిగా కనిపిస్తున్నారు మీరు. మీ దేశంలో వీటికి ఎంత యిస్తారో , అంతే యివ్వండి." అన్నదామె.

భారతీయ సంస్కృతికి మచ్చు తునక ఆ మాట. పరాయి దేశస్తుల పాలనలో వివిధ నాగరికతలను, మనస్థత్వాలను జీర్ణించుకోవటానికి ముందు - భారతీయుల పసిడి మనస్సులను ఎత్తి చూపించే మాట అది. ధర్మం నాలుగుపాదాల మీదా నడిచే రోజుల్లో స్వార్థాన్ని మరిచి, ఎదుటివారి అంతరంగాలకు అనుగుణంగా నడుచుకునే భారతీయులు - అలాగే ప్రవర్తించేవారు.

"మా దేశంలోవున్న ధరయిస్తే - ఈ పది చక్రకేళీలతోనే నువ్వు రెండు అంతస్థుల మేడ కట్టేసి - పిల్లాపాపలతో కాపరం పెట్టేస్తావ్. తల్లీ ... మీ దేశపు ధర చెప్పమ్మా ..." అంటూ వాలెట్ లో నుంచి వందరూపాయల విలువచేసే ట్రావెలర్స్ చెక్ ని బయటికితీశాడు ముఖేష్.

"విక్రమార్కుడి కాలంలో బాంకులు వున్నాయనా నీ వుద్దేశ్యం?" నవ్వుతూ అన్నాడు షాడో.

గతుక్కుమని ... గబగబా వాలెట్ ని జేబులోకిసెట్టి ... షాడో పక్కన కూలబడ్డాడు ముఖేష్!

"ఎలా రాజు? ఇక మనం యాచక వృత్తిని స్వీకరించ వలసిందేనా?" అన్నాడు విచారంగా ముఖంపెట్టి.

ఆ మాటలు అర్థం కాకపోయినా, ఆ భావం అర్థమయింది దుకాణంలోని పడుచుపిల్లకు.

"మీ దగ్గిర డబ్బులేకపోతే ... తర్వాత యిద్దురుగాని ... ముందు మీ ఆకలి తీర్చుకోండి." అన్నది.

"తల్లీ ... అన్నపూర్ణా ... కలకాలం వర్థిల్లు ... కాని యిప్పుడు మా సమస్య యీ పది చక్రకేళీలతో తీరదమ్మా ... ప్రస్తుతం దివాళా ఎత్తి వున్నాం. మా సమస్యకు ఒక పర్మినెంట్ సొల్యూషన్ కావాలి. టెంపరరీ అరేంజిమెంట్లు పనికిరావు." అన్నాడు ముఖేష్.

"మీ మాటలు నాకు అర్థం కావటంలేదు... చక్రకేళీలు కావాలా వద్దా ?" విసుగ్గా అన్నదా చిన్నది.

"మరి డబ్బు?"

" తర్వాత యివ్వండి. మీరు యివ్వకుండా ఎగగొట్టి పారిపోయినా నాకు నష్టంలేదు. మా తోట పళ్ళివి. ఇంకా బోణీకాలేదు. దానం చేశానని అనుకుంటాను."

"హరహరా" కలకత్తాకాళీ... ఆఖరికి మా గతిని అడుక్కు తినటం లోకి దించావా? ఏమిటమ్మా నీ లీల!" అంటూ చక్రకేళీలను అందుకున్నాడు ముఖేష్.

వారిద్దరినీ చూడటానికి అక్కడ చాలా మంది పోగయినారు. అలా పోగయిన వారు... మరింత దగ్గిర్నించి చూడాలన్న కుతూహలంతో అతి సమీపంలోకి వచ్చారు.

"దిష్టి బొమ్మల్ని చూసినట్లు చూడకండి... నాలుగు చక్రకేళీలు ఖరీదుచేసి మరీ చూడండి..." అంటూ వారికి సలహా యిచ్చాడు ముఖేష్, దేవనాగరి భాషలో.

ఆ మాటలు వారందరికీ నవ్వు తెప్పించాయి. అతను చెప్పినట్లే చేశారు. పావుగంటలో దుకాణంలోవున్న సరుకంతా అమ్ముడయి పోయింది.

"మీరెవరో ... మహానుభావుల్లా వున్నారు ... నేను పుట్టినప్పటి నుంచీ మా నాయన యీ దుకాణాన్ని నడుపుతున్నాడు ఇంతవరకూ ఇలా అమ్మకం జరిగిన రోజు లేదు. నేనేమైనా తప్పుగా ప్రవర్తించివుంటే దయచేసి క్షమించాలి!" అంటూ ముఖేష్ కాళ్ళు పట్టుకోబోయింది ఆ చిన్నది.

"ఛ ... ఛ ... ఏమిటమ్మా యిది? ముక్కు మొగం తెలియని వాళ్ళకు అప్పు యిచ్చి ... నెమ్మదిగా తీర్చుకోండి అన్న బంగారు మనస్సు నీది. నువ్వమ్మా మహానుభావురాలివి. మేం వట్టి దేశ దిమ్మరులం ..." అంటూ ఆమె భుజాలను పట్టుకొని లేవతీశాడు ముఖేష్.

అదే సమయంలో, అక్కడ గుమికూడిన వారందరూ తలా ఒక దిక్కుకూ పారిపోయారు. గుర్రపు డెక్కల శబ్దంతో దడదడ లాడి పోయింది ఆ ప్రదేశం. పదిగుర్రాలు సూటిగా వచ్చి, ఆ దుకాణం ముందు ఆగాయి.

ముందున్న గుర్రంమీద ఓ బుర్రమీసాల వ్యక్తి కూర్చుని వున్నాడు. అతని నడుముకు వ్రేలాడుతున్న కత్తి, ధరించిన దుస్తుల తీరు చూడగానే ముఖేష్ కి నవ్వు వచ్చింది.

"రాజు ... మనమిద్దరం కలిసి ఒక తెలుగు సినిమా చూశాం ... దాని పేరేమిటి?" అన్నాడు.

"కోటలో పిల్ల , తోటలో రాణి."

"కాదు."

"అగ్గిపిడుగు."

"అదీకాదు."

"బంగారు తిమ్మరాజు."

"కానే కాదు ."

"అయితే అదేదో డబ్బింగ్ పిక్చర్ అయివుంటుంది."

"కావచ్చు. అందులో సరిగ్గా యిదే సీను వుంది ... ఇప్పుడు జరుగబోయేది కూడా అదే, చూస్తూ వుండు" అంటూ లేచి దుకాణపు స్తంభాన్ని ఆనుకొని నిలబడ్డాడు ముఖేష్.

బుర్రమీసాల వ్యక్తిని చూడగానే భయంగా వెనక్కి వదిగి నిలబడింది, దుకాణపు చిన్నది.

"వంటిమీద చెయ్యేస్తే , కసిరికొట్టావ్ మొన్న ... ఇప్పుడు ఈ పగటి వేషగాళ్ళతో కులుకుతున్నావా?" ఉరుములాంటి గొంతుకతో ఆమెవైపు చూస్తూ గర్జించాడావ్యక్తి.

"రేయ్ బుర్రమీసం ... మాటలు జాగ్రత్తగారానీ ... పగటి వేషం ... అదీ యిదీ అంటున్నావ్ ... వళ్ళు ఎలా వుంది?" అడిగాడు ముఖేష్.

"అయ్యా ... వాడు మహారాజుగారి అంగరక్షక సైన్యంలో ఒక దళపతి. వట్టి దుర్మార్గుడు ... మీరు అనవసరంగా వాడితో పేచీ పెట్టుకోకండి." షాడో చెవిలో చెప్పింది ఆ చిన్నది.

"ఇటువంటి దళపతులను, దున్నపోతుల్ని నరికినట్లు నరికి అమ్మవారికి బలి యివ్వటం మా ఆచారం ... నువ్వు ఖంగారు పడకమ్మా ... సరదాగా చూస్తుండు." ఆ మాటలను విన్న ముఖేష్ ఆమెకు ధైర్యం చెప్పాడు.

ఆ మాటలు గుర్రంమీది వ్యక్తికి ఆగ్రహాన్ని కలిగించాయి. చటుక్కున గుర్రంమీది నుంచి కిందికి దూకి ముఖేష్ మీద కలబడ్డాడు.

మెరుపులా పక్కకు జరిగాడు ముఖేష్. పిడికిలి బిగించి, అతని గడ్డం కింద బలంగా గుద్దాడు.

ఆ వ్యక్తి ప్రాణం దిమ్మెరపోయింది. ఎగిరి వెనక్కు పడ్డాడు.

ఎడమ కాలిమీద జాగ్రత్తగా లేచాడు షాడో. పడుతున్న వ్యక్తిని, పూర్తిగా పడనీయకుండా మధ్యలోనే మరో పిడిగుద్దు గుద్దాడు.

గాలిలోకి లేచి, గుర్రం కాళ్ళముందు పడ్డాడతను. అతని సహచరులకు అంతా అయోమయంగా కనిపించింది. అసలు ఏమి జరిగిందో వారికి అర్థంకాలేదు. కన్నుమూసి తెరిచేటంతలో అంతా పూర్తి అయిపోయింది.

సింహనాదాలు లేవు. తొడలు చరచటాలు లేవు ... బాహువులను విదిలించి, మీసాలు మెలిపెట్టటం, అసలేలేదు. అంతా ఇంద్రజాలంలా అగుపించింది వారికి.

"పొండిరా ... తిరిగి యీ దుకాణం ముందు గోలచేసినట్లు తెలిస్తే మీ అందర్నీ ముక్కలు ముక్కలుగా నరికి, వుప్పులో వూరబెట్టి, కాకులకు విందుచేస్తా!" హుంకరించాడు ముఖేష్.

గబగబా గుర్రాలు దిగి, బుర్రమీసాల వ్యక్తిని, గుర్రం మీదికి ఎక్కించారు వారు ... మరొక్క క్షణంకూడా అక్కడ ఆగకుండా వెళ్ళిపోయారు ఆ ప్రదేశాన్ని వదిలి.

చేతులు దులుపుకుంటూ షాడోవైపు తిరిగి నవ్వాడు ముఖేష్. "రాజు ... బాక్సింగ్ అంటే వీళ్ళకు తెలుసంటావా?" అంటూ.

"బాక్సింగ్ మాట దేవుడెరుగు ... ముందు ఎవడైనా డాక్టర్ లాంటి వాడు కనిపిస్తాడేమో చూడు ... వరస చూస్తుంటే, మనం కాళ్ళు చేతులమీదే బ్రతకాల్సి వచ్చేటట్లుంది." ఎడమ చేతిని పైకి ఎత్తటానికి విఫల ప్రయత్నం చేస్తూ అన్నాడు షాడో.

"అందరూ ... ఇలాంటి అన్నపూర్ణలు వుండరు ... మనకు ఓ.పి.గా పనిచేసే డాక్టర్ ఎవరుంటారు." అంటూ పక్కకు తిరిగాడు ముఖేష్.

"నా కూతుర్ని వెక్కిరించాడని ... మీరు దళపతితో కయ్యం పెట్టుకున్నారట " ఎవరయ్యా మీరు? మీ సహాయానికి ప్రతిగా నేను

ఏమి చేయగలను?" అంటూ అక్కడికి వచ్చాడొక యాభై సంవత్సరాల మనిషి.

అక్కడి వారందరివలెనే ... వెనక్కి ముడిచి, మడికట్టిన శిరోజాలు, దోవతి, అంగీ, చెవికమ్మలు, కడియాలు మొదలైన వాటితో వింతగా కనిపిస్తున్నాడతను.

"బాబాయ్ ... పరదేశీయులం మేము. ఖర్మకాలి యీ దేశంలోకి వచ్చిపడ్డాం. నువ్వు మాకు ఏ సహాయమూ చేయనవసరం లేదు గాని, ఒక మంచి డాక్టర్ ని చూపించు ..." క్షణంలో వరస కలుపుతూ అన్నాడు ముఖేష్.

"డాక్టరా? అంటే ఏమిటి?"

"క్షమించాలి బాబాయ్ ... డాక్టర్ కాదు ... మంచివైద్యుడు కావాలి ... మేము పుస్తకాల్లో చదివినట్లు, రాజవైద్యులు ... అపరధన్వంతరులు, అశ్వినీ దేవతలు మొదలైన వాళ్ళెవరయినా వున్నారా యీ రాజ్యంలో.

"వాళ్ళని మించిన వాళ్ళే వున్నారు... రండి ..." అంటూ చేయి అందించి షాడోని లేపబోయాడతను.

వద్దని వారించి లేచి నిలబడ్డాడు షాడో.

వారిద్దరినీ వెంటబెట్టుకొని తన యింటికి తీసుకుపోయాడా పెద్ద మనిషి. దారిలో అతని పేరు భూపతి అని తెలుసుకున్నాడు ముఖేష్. అతని కూతురు పేరు చంద్రిక. మగధ రాజ్యంలోని చిత్రదుర్గమనే పట్టణమది. వీరసేనుడనే రాజు దాన్ని పరిపాలిస్తున్నాడు.

చంద్రిక వారికంటే ముందే యింటికి వెళ్ళింది. షాడో ముఖేష్ ల విషయం అక్కడ టాంటాం చేసేసింది. భూపతి యింటిముందు ఎంతోమంది పోగయివున్నారు.

భూపతి భార్య, వారిని ఎంతో సాదరంగా ఆహ్వానించింది. అరగంట తరువాత స్నానపానాదులు ముగించుకొని, కడుపునిండా భుజించి, మండువాలో కూర్చున్నారు స్నేహితులు యిద్దరూ.

బయటికి పోయిన భూపతి, ఒక వృద్ధుణ్ని వెంటబెట్టుకు వచ్చాడు. "దుస్తుల్ని తొలగించు నాయనా..." అన్నాడా వృద్ధుడు. వెంట తెచ్చిన మందుల సంచిలోనుంచి కొన్ని సూదులలాంటి సాధనాలనుతీస్తూ.

పాంటు, షర్టు వూడతీసి డ్రాయర్ తో అతనిముందు కూర్చున్నాడు షాడో. భూపతి సన్నిహితులు, దగ్గిరి బంధువులు కొద్దిమంది అక్కడవున్నారు.

షాడో పర్సనాలిటీనిచూసి నోర్లు తెరిచారు వారందరూ.

"మీరు ఏ దేశంనుంచి వచ్చారు?" నీలం రంగుకు తిరిగిన షాడో ఎడమ చేతిని సూదులతో పొడుస్తూ అడిగాడా వృద్ధుడు.

"భారతదేశం నుంచి."

"భారతదేశమని తెలుస్తూనే వుంది నాయనా ... ఇటువంటి వజ్రకాయం భారతీయులకు కాక మరెవరికి వుంటుంది! భారతదేశంలో ఏ ప్రాంతం అని అడుగుతున్నాను..."

ముఖాముఖాలు చూసుకున్నారు షాడో ముఖేష్ లు.

షాడో ఎడమ చేతిమీద చిన్న చిన్న దద్దుర్లు ఎక్కి వున్నాయి. వాటిలో నుంచి నీలంరంగు ద్రవం సూదిపోట్ల మూలంగా వెలుపలికి వచ్చేస్తోంది.

మెల్లిగా చేతిలో చలనం ప్రారంభమయింది.

"ఏం నాయనా ! మాట్లాడవు?" రెట్టించి అడిగాడా వృద్ధుడు.

"నాది మాళవదేశం తాతా ... మా వాడు మాత్రం కృష్ణ మండలం నుంచి వచ్చాడు. పేరు వినేవుంటావ్ ... శాతవాహన చక్రవర్తులు పరిపాలిస్తున్న శ్రీకాకుళ ప్రాంతం అది... మహామొండి జాతిలే అది. ఆ మొండి జాతికి చెందిన మనిషే మావాడు..." గడగడా నోటికి వచ్చిన పేర్లు వల్లించేశాడు ముఖేష్ .

"ఓహో !" అన్నట్లు తలవూపాడు వృద్ధుడు.

"షాడో చేతికి ఏవో పసర్లు పూసి కట్టుకట్టి - కుడికాలిని పరీక్షించాడు.

"ఇది పెద్ద దెబ్బేమీకాదు. కొంచెం బెణికింది ... ఒక వారంరోజులు ఇలాగే బరువు మోపకుండా కర్రసాయంతో నడిస్తే సర్దుకుంటుంది." అని చెప్పాడు.

అతను సంచిని సర్దుకుంటుండగా ... యధాలాపంగా వాలెట్ తీశాడు ముఖేష్ .

కిసుక్కున నవ్వింది తలుపుచాటున కూర్చుని అంతా చూస్తున్న చంద్రిక. సిగ్గుపడి వాలెట్ ని జేబులోకి తోసేశాడు ముఖేష్ .

"రేపువచ్చి చూస్తాను ..." అంటూ వెళ్ళిపోయాడా వృద్ధుడు.

"మీరు ఏ పనిమీద వచ్చారు? నిస్సంకోచంగా చెప్పండి. మాకు చేతనయిన సహాయం చేస్తాం." భూపతి సన్నిహితుడొకడు మెల్లిగా సంభాషణ ప్రారంభించాడు.

"మా ఎయిర్ బాగ్ —" అనబోయిన ముఖేష్ ని కనులతోనే వారించాడు షాడో. ఆ విషయం వెల్లడి అయితే - క్షణాలమీద నగరమంతా వ్యాపిస్తుంది. ఎయిర్ బాగ్ లోని విగ్రహం - యిక తమకు దక్కదు.

"ఏమీ లేదు బాబాయ్ ... దేశసంచారానికి బయలుదేరాం." క్షణంలో మాటమార్చేశాడు ముఖేష్ .

ఇంకేదో అడగబోయాడా పెద్దమనిషి.

అంతలోనే - "భూపతీ పరదేశీయులెవరో నీ యింటికి వచ్చారుట! ఎక్కడవున్నారు?" అంటూ లోనికి వచ్చాడొక దృఢకాయుడు.

కవచ శిరస్త్రాణాలు ధరించి, పెద్ద కత్తిని నడుముకు వేలాడ తీసుకొని వున్నాడతను. అతని వెనుక పాతికమంది సైనికులు వచ్చారు.

మెరుపుల్లా కదిలారు షాడో ముఖేష్ లు. ఉన్నచోటి నుంచి వెనక్కి దొర్లి - తన బూట్లమీద చెయ్యివేశాడు షాడో, కుడికాలి బూటులో వున్న డాగర్ ని బయటికిలాగి- ఎడమ మోకాలిమీద కూర్చుంటూ—

"రివాల్వర్ ని తీయద్దు ముఖేష్ ... దాని సంగతి వీరికి తెలియకూడదు ... అత్యవసర సమయాల్లో మనకు ఎంతగానో వుపయోగిస్తుంది అది." రివాల్వర్ మీద చెయ్యివేయబోతున్న ముఖేష్ ని హెచ్చరించాడు.

మరుక్షణం - పాంటుకు బిగించివున్న బెల్టును వూడలాగాడు ముఖేష్ .

దగ్గిరికి రాబోయాడా దృఢకాయుడు. వెంటనే గాలిలోకి లేచింది ముఖేష్ బెల్టు. కొరడాలా ఛళ్ మని శబ్దం చేసింది ఆ దృఢకాయుడి ముఖం ముందు.

అదిరిపడి వెనక్కి జరిగాడతను.

ముఖేష్ వ్యవహారం చంద్రికకు కొంతవరకూ తెలిసివుంది. ఆమె తలుపుల చాటునుంచి బయటకు పరుగెత్తుకువచ్చి, ఆ దృఢకాయుడికి మధ్య అడ్డుగా నిలబడింది.

"నిశంభుడు మీకు అపకారం చెయ్యటానికి రాలేదు. దయచేసి మీ ఆయుధాలను కిందికి దించండి..." అన్నది ప్రార్థనా పూర్వకంగా.

"పరదేశీయులు ఎవరైనా నగరంలోకి వస్తే - వారి వివరాలను తెలుసుకొని - ఎందుకొచ్చారో కనుక్కొని - సహాయం చేయటానికి నియమించబడిన అధికారి యీ నిశంభుడు. మీకు మిత్రుడే కాని శత్రువుకాదు." అన్నాడు చంద్రిక తండ్రి భూపతి.

గురూ ... పొరపాటు పడ్డాం ... యీ నిశంభుడెవడో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ లా వున్నాడు. ఇతన్ని కాకాపడితే మనకు చాలామంది అనిపిస్తోంది." మెల్లిగా అన్నాడు ముఖేష్ - షాడోవంక చూస్తూ.

తలవూపి డాగర్ ని కిందికి దించాడు షాడో. బెల్టును చేతికి చుట్టుకుంటూ, తమ తొందరపాటుకు నిశంభుణ్ణి మన్నింపు కోరుకున్నాడు ముఖేష్.

చంద్రిక తృప్తిగా నిట్టూర్చి లోపలకు వెళ్ళిపోయింది.

అంతకుముందు షాడో చేతికి కట్టుకట్టిన వృద్ధుడికి చెప్పిన విషయాలే నిశంభుడికి ముందు వల్లించాడు ముఖేష్.

దేశసంచారంచేస్తూ అటుగా వచ్చామనీ, కొంతకాలం చిత్రదుర్గం లోనే వుండాలని అనుకుంటున్నామని చెప్పాడు. అయితే తమ దగ్గిర డబ్బేమీ లేకుండాపోయింది కాబట్టి - రాజుగారి కొలువులో ఏదైనా వుద్యోగం యిప్పించమని వేడుకున్నాడు.

"రణదుర్గ రాజ్యాధిపతికీ, మాకు యుద్ధం సంభవించే సూచనలు అగుపిస్తున్నాయి. శత్రువులు మారువేషాల్లో మాలో ప్రవేశించి విద్రోహకర చర్యలు మొదలుపెట్ట వచ్చనే అనుమానం చాలా ఎక్కువగావుంది. ఈ సమయంలో అపరిచితులు, పరదేశీయులు అయిన మీకు బాధ్యతాయుతమైన పదవులు దొరకటం చాలా దుర్లభం..." ముఖేష్ మాటలకు సాలోచనగా తలవూపుతూ అన్నాడు నిశంభుడు.

"మరి ఏ పదవులు దొరుకుతాయి?" నీరసంగా అడిగాడు ముఖేష్.

"ద్వారపాలకులు ... రాజ్యసభలో సేవకులు ప్రస్తుతం తక్కువగా వున్నారు. కావాలంటే ఆ పదవులు యిప్పిస్తాను." అన్నాడు నిశంభుడు.

నుదురు చిట్లిస్తూ ఏదో అనబోయాడు ముఖేష్ .

"ద్వారపాలకులయితే ఏం? కష్టించి పనిచేస్తారు ... కష్టానికి ప్రతిఫలం సంపాదించుకుంటారు. అభిమానమున్న మనిషికి అంత కంటె యింకేం కావాలి! నిశంభా ... రేపు తెల్లవారగానే నువ్వు వీరిని

తీసుకుపోయి రాచకొలువులో చేర్పించు యిది నా అభ్యర్దన." ముఖేష్ కంటె ముందుగా అన్నాడు భూపతి.

"నువ్వు నన్ను ఆజ్ఞాపించాలి మామా ... అభ్యర్ధించకూడదు. పరదేశీయులను చేరతీసింది నువ్వని తెలియగానే వెంటనే వచ్చింది దేనికని అనుకుంటున్నావ్ ..." అంటూ లేచాడు నిశంభుడు.

"మనం ద్వారపాలకులం కాక తప్పదంటావా రాజు?" ఏడుపు ముఖంపెట్టి అంటున్న ముఖేష్ ని నోరు మూసుకోమని కనులతో గద్దించాడు షాడో.

పక్కకు తిరిగిన ముఖేష్ కి - వెళ్ళిపోతున్న నిశంభుణ్ణి కిటికీలో నుంచి తొంగి తొంగి చూస్తున్న చంద్రిక కనిపించింది.

"సఖీయా వివరింపవే - వగలెరిగిన ప్రియునికి నాకథ!... సఖియా ..." అంటూ తెలుగుపాట నొకదాన్ని దేవనాగరిలోకి చేతనయినట్లు ట్రాన్స్ లేషన్ చేసి పాడేశాడు.

ఉలిక్కిపడి వెనుతిరిగింది చంద్రిక, సిగ్గు, ఆశ్చర్యం మొదలైన భావాలన్నీ ఒక్కసారిగా ఆక్రమించుకునేసరికి - ముఖాన్ని చేతులతో దాచుకొని లోపలకు పారిపోయింది.

మెల్లిగా మండువాలోవున్న మంచంమీదికి చేరారు స్నేహితులు యిద్దరూ . అలసిపోయిన శరీరాలు - వెంటనే నిద్రాదేవికి లొంగిపోయింది.

బాగా చీకటిపడిన తర్వాత - ఎందుకో మెలుకువవచ్చి కళ్ళు తెరిచాడు ముఖేష్. మండువా ముందున్న మామిడి చెట్టుకింద భూపతి, అతని భార్య, చంద్రిక, మరికొందరు అంతరంగికులు - సమావేశమైవున్నారు.

వాళ్ళు తమను గురించే మాట్లాడుకుంటున్నారని గ్రహించి, కదలకుండా ఆ మాటలను ఆలకించాడు ముఖేష్.

"ఎవరో గాని - సామాన్యులు కాదు." అంటున్నది భూపతి భార్య.

"దళపతిని పడగొట్టిన విధానం మీరు చూడాల్సింది. మెరుపు కూడా అంతవేగంగా కదలలేదు. మన రాజ్యంలో వున్న బలవంతులందరూ ఒకటైనా, ఒక మనిషిని ఎత్తి వెనక్కు విసిరే దెబ్బ కొట్టలేరు." చంద్రిక అన్నది.

"ఒక మాటకు పదిమాటలతో సమాధానమిచ్చే - ఆ వాగుడుకాయలో - మాటలవాడి ఒక్కటేకాదు ... చేతలు మాటలకంటే చురుకుగా వున్నాయి. నిశంభుణ్ని నిలబెట్టిన విధానం చూశారా!" అన్నాడు భూపతి ఆత్మీయుడొకడు.

కొద్ది క్షణాలపాటు ఆ ప్రదేశాన్ని రాజ్యమేలింది మౌనం.

"అతని జతగాడు అతనికంటె ప్రమాదకరమైన వ్యక్తి. ఒక కాలు, చేయి పనిచేయకుండా చచ్చుపడినట్లువున్న సమయంలోనే- నిశంభుణ్ని ఎదురించేటందుకు సిద్ధపడ్డాడు. కాళ్ళు చేతులు తిన్నగా

వుంటే - అతనిముందు నిలబడి తేరిపారచూసే దమ్ము ఎవరికీ వుండదు." అన్నాడు భూపతి.

"ఏమయినా ... ఒక కడుపున పుట్టిన అన్నదమ్ములు కూడా అంత ఆత్మీయంగా వుండరు. ఏ తల్లి కన్నబిడ్డలో గాని నరనారాయణుల్లా వున్నారు..." అంటున్నది భూపతి భార్య.

ఆ పైన వినటానికి సిగ్గువేసి ... బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు ముఖేష్.

6

తెల్లవారగానే వచ్చాడు నిశంభుడు. తన వెంట రెండు ధోవతులు, రెండు అంగీలు, వుత్తరీయాలు తీసుకువచ్చాడు.

"రాజ్యసభలో మీ ఆకారాలు అందరికీ వింతగా కనిపిస్తాయి. ఎవరు ఏమని అన్నా - పెదవి కదలించకండి. అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానాలు యివ్వండి. మిగిలిన విషయాలు నాకు వదలండి." అని హెచ్చరించాడు.

షాడోచేయి మూడువంతులు బాగయింది. కాలు మాత్రం అలాగే వుంది. అందువల్ల ఒకే ఒక వూతకర్రను తీసుకొని నిశంభుడితో బయలుదేరాడు. భూపతి హెచ్చరికలను బుద్ధిగా విని అతన్ని అనుసరించాడు ముఖేష్.

తళతళ లాడుతున్న పాలరాతితో కట్టబడి వుంది రాజ్యసభ. ద్వారపాలకులు నిశంభుడికి అభివాదంచేసి - స్నేహితులిద్దరివంకా ప్రశ్నార్థకంగా చూశారు.

"రేపటినుంచి మీకు జతగాళ్ళుగా వస్తారు వీరు...నాకు దూరపు బంధువులు." చల్లగా ఒక అబద్దాన్ని వదిలి రాజ్యసభలోకి దారితీశాడు నిశంభుడు.

మహారాజు వీరసేనుడు కొలువు తీర్చివున్నాడు. మంత్రి సామంతులు ఆయన్ను పరివేష్టించివున్నారు.

షాడో ముఖేష్ లు సభలో అడుగు పెట్టేసరికి ఒక నర్తకి అత్యద్భుతంగా నాట్యం చేస్తోంది - మహారాజు ముందు.

"ఆమె రాజనర్తకి నళిని ... దేవకన్యలుకూడా ఆమెతో పోటీ చేయలేరు." ముఖేష్ చెవిలో అన్నాడు నిశంభుడు.

అప్రయత్నంగా విజిల్ వేశాడు ముఖేష్. చటుక్కున అతని నోరు మూశాడు షాడో. "బ్లడీఫూల్...కొంపలు ముంచే ప్రయత్నం చెయ్యకు." అంటూ.

నళినిదేవి నాట్యం ముగిసింది. సభికుల హర్షధ్వానాలతో మార్మోగిపోయింది రాజసభ.

మహారాజు అందించిన బహుమతులను గ్రహించి, రాయంచలా వెనుతిరిగింది నళినీదేవి.

"గురూ ... ఒక చెయ్యి చూస్తావేమిటి?" షాడో ఆమె వంకే పట్టిపట్టి చూస్తూవుండటం గమనించి గుసగుసలాడాడు ముఖేష్.

వారివంక కన్నెత్తికూడా చూడకుండా వెళ్ళిపోయిందామె.

అడుగులో అడుగువేస్తూ అతి వినయంగా ముందుకు పోయాడు నిశంభుడు. రాజసింహాసనానికి రెండుమెట్ల కిందవున్న బంగరు పీటమీద ఒక వృద్ధుడు కూర్చుని వున్నాడు. నిశంభుడు ఆయన దగ్గిరికిపోయి ఏదో విన్నవించుకున్నాడు.

తల వూపాడా వృద్ధుడు. నిశంభుడి స్నేహితులిద్దరి వైపు చూశాడు.

"సి.ఐ.బి. ఇంటర్వ్యూకు అటెండ్ అయిన రోజుకూడా యింత అనీజీగా ఫీల్ కాలేదు... పిశాచులను చూసినట్లు చూస్తూన్నారు మన వంక..." షాడోకి మాత్రమే వినబడేటట్లు అంటూ ముందు నడిచాడు ముఖేష్.

ఉబికి వస్తున్న నవ్వును అదిమి పట్టుకుంటూ అతని వెనుక అడుగులువేశాడు షాడో.

ముఖేష్ అనుమానాలు నిరాధారాలయ్యాయి.

మహారాజు వారివంక చూడనేలేదు. సభికుడు ఎవరో చెప్తున్న విషయాలను వింటూ పరధ్యానంగా వున్నాడు.

బంగరు పీటమీది వృద్ధుడు చిత్రదుర్గానికి మహామంత్రి అని తెలిసింది షాడో ముఖేష్ లకు.

"నిశంభుడు మాకు విశ్వాసపాత్రుడు. అతని బంధువులైన మీరుకూడా అదేమాదిరి చిత్రదుర్గ సింహాసనాన్ని సేవిస్తారని నాకు నమ్మకం వుంది. రేపటినుంచి అంతఃపురోద్యానవనానికి మీరు ద్వారపాలకులుగా పనిచేయాలి. నమ్మకంగా మసలుకోండి మీ సేవకు మహారాజు గుర్తింపు తప్పకుండా వుంటుంది" అన్నాడాయన.

ఆలాగేనని తలవూపుతూ వెనుతిరగబోయిన స్నేహితులిద్దర్నీ కనులతో వారించి నమస్కరించమని సైగచేశాడు నిశంభుడు.

వంగి వంగి నమస్కరించి వెనక్కివెళ్ళారు షాడో ముఖేష్ లు.

"రాజూ ... పాండవులు విరాటరాజు దగ్గిరికి అజ్ఞాతవాసానికి పోతున్నప్పుడు సేవకులు ఎలా మసులుకోవాలి, రాజుల క్రింద ఎలా పనిచేయాలి మొదలైన విషయాలు చెప్పింది ఎవరు?" బయటికివస్తూ అడిగాడు ముఖేష్.

"విదురుడని నా అనుమానం." సమాధానం యిచ్చాడు షాడో.

"ఏమని చెప్పాడో నీకు తెలుసా?"

"భారతం చదివితే తెలుస్తుంది."

"అది చదవకపోతే మనకీ వుద్యోగాలు ఎంతోకాలం నిలువవు. ఆ మంత్రి ముఖం చూస్తుంటే నాకు మన స్పెషల్ ఎఫెక్ట్స్ హెడ్ అరుణాచలం బాబాయి గుర్తుకు వస్తున్నాడు."

"మరి రాజుగారిని చూస్తే?"

"మా యింటి ఓనర్ జ్ఞప్తికి వస్తున్నాడు. ఆ పెద్దమనిషికూడా యిదేమాదిరి పోజు పెడతాడు."

ఫక్కున నవ్వాడు షాడో నవ్వులోనే - వారిద్దరికీ తామున్న పరిస్థితి గుర్తుకువచ్చింది...ఎంత కాదని అనుకున్నా వారి హృదయాలు బరువెక్కక మానలేదు.

"రాజా ... ఇది యదార్థమేనంటావా? మనం కలకనటం లేదుకదా!" అన్నాడు ముఖేష్ . కలే అవ్వాలి ... కాని ఆ కలలోకూడా తాము తమ డ్యూటీని మరిచిపోకూడదు. ఆ వింతకల అంతం అయ్యేలోగా ... దేవీ విగ్రహాన్ని సంపాదించి తీరాలి. రాచకొలువులో నిలదొక్కుకుని - నెమ్మదిగా ఎంక్వైరీలు ప్రారంభించాలి...

గాఢంగా నిట్టూర్చి ... భూపతి యింటివైపు అడుగులు వేశారు స్నేహితులు యిద్దరూ.

* * *

"నీ పేరేమిటి?"

"ముఖేష్ "

"వింతగా వుంది నీ పేరు. ఏదేశంనుంచి వచ్చావ్ ?"

"మాళవదేశం. మీ పేర్లుకూడా నాకు వింతగానే వినిపిస్తున్నాయి."

"అధిక ప్రసంగం..."

"మన్నించాలి. అలవాటయిపోయింది."

"ఇలా అయితే మీరు రాచకొలువులో నెగ్గుకురాలేరు. వినయం చూపించాలి. మర్యాదయిచ్చి మాట్లాడాలి." అంటూ సలహా యిచ్చింది చంద్రిక.

ద్వారపాలకులు దుస్తులు వేసుకుంటూ ఒకరివంక ఒకరు చూసుకొని చిరునవ్వులు చిందించారు షాడో ముఖేష్ లు.

"రాజు ... పాదుకల ప్రారంభం అయితే అయింది. మనవెంట ఒక కెమెరావుంటే ఎంతబాగుండేది" బాస్ కి యీ ఫోటోలు చూపిస్తే ఎంత సరదాగా వుంటుంది" అంటూ వుసూరుమన్నాడు ముఖేష్ - తలపాగా చుట్టుకొని - బరిశెను పట్టుకుంటూ.

"బ్లడీఫూల్ ! కలలో తీసిన ఫోటోలు - కల చెదిరిపోయిన తరువాత కనిపిస్తాయా? పిచ్చివేషాలు వెయ్యటం ఆపి - ముందు జరగబోయే విషయాలను గురించి ఆలోచించు. అంతఃపురోద్యానవనానికి

రాచకన్నెలు చాలామంది వస్తారు వళ్ళు దగ్గిర పెట్టుకోకపోతే మనం యినుపచువ్వలను లెక్కపెట్టుకోవలసి వస్తుంది" అన్నాడు షాడో.

అక్కడేవున్న చంద్రికకు వారి మాటలు అర్ధంకాలేదు.

"ముఖేష్ ...ఏమిటి మీరు మాట్లాడుతున్నది?" అని అడిగింది కుతూహలంగా.

"ఏమీ లేదమ్మా...ప్రేమలో ఎన్నిరకాలున్నాయో, కిటికీలలోనుంచి చూసి ప్రేమించటం ఎలాగో - మా వాడు నాకు చెప్తున్నాడు."

చంద్రిక ముఖం కెందామర పుష్పంలా తయారయింది.

"సిద్ధంగా వున్నారా? పదండి ... పోదాం ... " అంటూ అప్పుడే లోనికివచ్చాడు నిశంభుడు.

అతని వెనుక బయలుదేరారు స్నేహితులు యిద్దరూ. షాడో చేయి పూర్తిగా బాగయిపోయింది. కాలు మాత్రం పట్టి పట్టి అడుగువేయాల్సి వస్తోంది.

అంతఃపురోద్యానవనానికి ముందు పెద్ద సింహద్వారం వుంది. తలుపులులేవు. అక్కడి రక్షణ ఏర్పాట్లనుచూసే సైనికాధికారికి స్నేహితులిద్దరినీ పరిచయంచేసి ... వెళ్ళిపోయాడు నిశంభుడు.

బరిశెలు పట్టుకొని - సింహద్వారానికి అటూ యిటూ నిలబడ్డారు షాడో ముఖేష్ లు.

"పహారా హుషార్!" అని అరిచి - మిలటరీ స్టయిల్ లో రెండు అడుగులు వేశాడు ముఖేష్.

నడుముకు వ్రేలాడదీసుకున్న కత్తి, కాళ్ళమధ్యకు రావటంతో, బోర్లాపడ్డాడు.

ఫక్కున నవ్వింది, అప్పుడే అటుగా వచ్చిన ఒక అంతఃపుర దాసీ ఎర్రబడిపోయింది ముఖేష్ ముఖం. సీరియస్ గా బరిశెను పట్టుకొని, ద్వారం పక్కనే నిలబడ్డాడు, నల్లరాతి బొమ్మలాగా.

* * *

సాయం సమయమౌతుండగా వచ్చారు రాకుమారి రంజని, రాజనర్తకి నళిని, మరికొంత మంది రాచకన్నియలతో కలిపి.

"కొత్తగా కొలువులో చేరింది మీరేకదూ!" రాకుమారి తరపున ముఖేష్ ని ప్రశ్నించింది ఒక పరిచారిక.

అవునన్నట్లు తల వూపాడు ముఖేష్.

"మీ దేశంలో, మా రాచకన్నికలను మించిన అందగత్తెలు వున్నారా?"

పొగడ్తలు విని ఆనందించటం, భారతీయ పరిపాలకులందరికీ వున్న పెద్ద జబ్బు. భట్రాజులను నియమించుకొని, వారి పొగడ్తలను వింటూ

వుండటం అనాదిగా వస్తున్న ఆచారం. అది చిత్రదుర్గంలో కూడా వున్నది.

ముఖేష్ ఎక్కడ మాట తూలతాడో అని వూపిరి బిగపట్టి నిలబడ్డాడు షాడో. ఏ మూడ్ లో వున్నాడో కాని, ముఖేష్ సజావుగానే సమాధానం యిచ్చాడు.

"మీ రాచకన్నియల అందం పున్నమి వెన్నెలతో సమానం..." అన్నాడు.

"మరి మీ దేశపు స్త్రీల అందం?" ఈ సారి రాజకుమారే అడిగింది వినోదంగా.

"అమావాస్య అందాలతో సరిసమానం."

కిలకిలా నవ్వారు అందరూ సంతోషించిన రాజకుమార్తె తన మెడలోవున్న ముత్యాలహారాన్ని ముఖేష్ మీదికి విసిరి వుద్యాన వనంలోకి వెళ్ళిపోయింది.

అమెను అనుసరిస్తున్న రాజనర్తకి నళినివైపే చూస్తున్న షాడో, ముఖేష్ బరిశెతో కితకితలు పెట్టేసరికి వులిక్కిపడి పక్కకు చూశాడు.

"రాజులను ఎలా పొగడాలో, మీ తెలుగు వాళ్ళకి బాగా తెలుసని అంటారు... కాస్త నేర్పునాయనా... రేపటినుంచీ రోజుకొక

ముత్యాలహారం సంపాదించుకుంటాను..." అంటూ బ్రతిమాలాడు ముఖేష్.

ఏదో సమాధానం యివ్వబోయిన షాడో, అటుగా వస్తున్న దళపతిని చూడగానే ... నొసలు ముడివేస్తూ, ముఖేష్ కి సైగచేశాడు.

ఠీవిగా అడుగులువేస్తూ వారిని సమీపించాడు దళపతి. "కోటలో పాగావేశారన్నమాట! ఏ దేశంనుంచి వచ్చిన గూఢచారులు మీరు?" అన్నాడు నడుముమీద చేతులు వేసుకొని నిలబడి.

"స్వర్గానికి పోయినా సవతిపోరు తప్పదన్నట్లు, చచ్చీ చెడి విక్రమార్కుడి కాలంలోకి వచ్చినా, ఈ గూఢచారులనేమాట వినిపించకుండా వుండటంలేదు! విసుగ్గా అన్నాడు ముఖేష్.

దళపతికి అతని మాటలు అర్థంకాలేదు. "ఏమిటి వాగుతున్నావ్?" అన్నాడు కోపంగా.

షాడోవంక చూశాడు ముఖేష్. తలవూపాడు షాడో.

మరుక్షణం పిడికిలి బిగించి, దళపతి పొట్టలో పొడిచాడు ముఖేష్. బాధతో అతను ముందుకు వంగగానే, గడ్డం కింద గుద్ది, కాలితో వెనక్కు తోసేశాడు.

"మీ అంతుచూస్తా!" వంటికి అంటిన దుమ్ము దులుపుకుంటూ అరిచాడు దళపతి.

"పోరా లఫూట్ ... నీలాంటి వాళ్ళని చాలా మందిని చూశాం. సవాలక్ష కథలు విన్నాం... పోయి నీకు దిక్కున్న చోట చెప్పుకో ..." అంటూ బరిశె ముందుకు జాపి ఓ అడుగుపేశాడు ముఖేష్.

ఖంగారుగా వెనుతిరిగి వెళ్ళిపోయాడు దళపతి.

"ముఖేష్ ... మనకు వీడు విలన్ గా తయారౌతాడు... కొంచెం జాగ్రత్తగా వుండటం చాలా మంచిది." సాలోచనగా అన్నాడు షాడో.

అరఘుడియ తరువాత షాడో మాటలు యధార్థమైనాయి.

దళపతిని వెంట బెట్టుకొని యువరాజు శ్రీసేనుడు, మంత్రి కుమారుడు జయపాలుడు అక్కడికి వచ్చారు.

"దళపతిని అవమానించారట నిజమేనా?" మంత్రి కుమారుడు సూటిగా అసలు విషయాన్ని అడిగేశాడు.

"నిజమే ..." అన్నాడు ముఖేష్.

"ఎందుకు?"

"మమ్మల్ని అతను అవమానించాడు కాబట్టి."

"పొట్టకూటికి పరాయి దేశంవచ్చిన మీకు ఇంత అహంకారమా? సామాన్యమైన ద్వారపాలకులు మీరు... ఒక దళపతినే అవమానిస్తారా?" ఎర్రబడిన ముఖంతో హుంకరించాడు యువరాజు.

"యువరాజా ... అభిమానమన్నది వుప్పూకారం తినే ప్రతిమనిషికీ వుంటుంది. ఆ అభిమానానికి దెబ్బ తగిలిన రోజున దళపతికాదు. సాక్షాత్తూ ఆ దేవ దేవుడేవచ్చినా అందుకు తగిన ప్రతిఫలాన్ని అనుభవించి వెనుతిరగాల్సిందే." నిర్లక్ష్యంగా సమాధానం యిచ్చాడు ముఖేష్ .

యువరాజు ఆగ్రహం హద్దులు మీరింది.

పళ్ళు కొరుకుతూ కత్తిని బయటికి లాగాడు.

"యువరాజా! ఆవేశంలో యుక్తాయుక్త విచక్షణ మీకు లోపిస్తుంది కాబోయే మహారాజులు మీరు, నేరాన్ని ప్రశాంతంగా పరిశీలించి, న్యాయాన్యాయాలు విచారించవలసిన ఓర్పు, నేర్పు మీకు వుండాలి. ఆవేశపడటం సామాన్యుల లక్షణం. రాజవంశీయులకు అది పనికిరాదు." వెంటనే హెచ్చరించాడు షాడో.

"నాకే నీతులు చెప్తున్నారా! చూడండి మిమ్మల్ని ఏం చేస్తానో ..." అంటూ కత్తిని గాలిలో ఝుళిపించాడు యువరాజు.

మరుక్షణం గాలిలోకి లేచింది ముఖేష్ బరిశె. యువరాజు కత్తి ఎగిరి అవతల పడిపోయింది.

అంతవరకూ, సింహద్వారాన్ని ఆనుకొనివున్న పొదలచాటున నిలబడి, ఆ రభసను గమనిస్తున్న రాచకన్నెలు ఒక్కసారిగా కెవ్వుమని అరిచారు.

వారి అరుపులు, అక్కడికి కొద్ది దూరంలోనేవున్న రక్షక భటాధికారి భవనంలోకి వినిపించాయి.

చీమలు పుట్టలోనుంచి వెలువడినట్లు వెలుపలికి వచ్చారు సైనికులు.

"రాజు ... ఈ పాడు వుద్యోగం నాకు నచ్చలేదు. ఈ తోలుబొమ్మల్ని ఒక వూపు వూపి వెళ్ళిపోదాం..." పోరుకు సిద్ధపడుతూ అన్నాడు ముఖేష్ .

"వద్దు ముఖేష్ . కొంచెం ఓపిక పట్టు. ఏమవుతుందో చూసుకొని, ఆ తర్వాత అన్నిటికి తెగించాలి." అంటూ అతన్ని వారించాడు షాడో.

సైనికులు వారిని చుట్టుముట్టి నిరాయుధుల్ని చేశారు. అప్పటికప్పుడు రాజుగారి ముందుకు తీసుకుపోయారు నేర విచారణ కోసం.

* * *

అంతఃపురంలో వున్నాడు మహారాజు, మహామంత్రి, సైన్యాధిపతులతో మంతనాలు కొనసాగిస్తున్నాడు.

రాజభటుల మధ్య తీసుకురాబడిన స్నేహితులిద్దర్నీ చూస్తూ, యువరాజు చేసిన అభియోగాన్ని జాగ్రత్తగా విన్నాడు.

"మహారాజా! పరాయి దేశంనుంచి వచ్చారు వీరు. మనదేశ వ్యవహారాలు, మనవారి మనస్తత్వాలు యింకా బాగా తెలిసి వుండవు." అందించాడు మహామంత్రి.

"ఏ దేశమైతే ఏం మహామంత్రీ! యువరాజుమీద కత్తి ఎత్తటం రాజ ద్రోహంగాదా?" ప్రశ్నించాడు మహారాజు.

"యువరాజు అయితే మాత్రం ఏమిటి మహారాజా? నేరాన్ని సరిగ్గా విచారించకుండా ఆవేశపడితే, చూస్తూ వూరుకోమంటారా?" అడిగాడు ముఖేష్.

మహారాజు కనులు అగ్నివర్ణాన్ని పులుముకున్నాయి.

"వీరిని చెరసాలలో బంధించండి ... రేపు రాజ్యసభలో వీరిని విచారించి శిక్షను అమలుపరుస్తాం." అన్నాడు.

మరో పావుగడియ తరువాత అంధకార బంధారమైన చెరసాలలో, చువ్వల వెనుక నిలబడి ఒకరినొకరు చూసుకున్నారు షాడో ముఖేష్ లు.

"రాజూ!" అన్నాడు ముఖేష్.

ఏమిటన్నట్లు కనుబొమ్మలు ఎగురవేశాడు షాడో.

"విక్రమాదిత్యుడి కాలం అంటే స్వర్ణయుగం అంటారుగాని ... వీళ్ళకంటే మనమే అదృష్టవంతులం. వాక్ స్వాతంత్రియం లేని రాజ్యంలో వుండటంకంటె, అడవుల్లో జీవించటం చాలా మంచిది.

అంగీకార సూచకంగా తల వూపి గోడకు ఆనించి వున్న నులక మంచంమీద కూర్చున్నాడు షాడో. అతని కనులముందు రాజనర్తకి నళినీదేవి నటనమాడుతున్నది. ఆ నాట్యానికి ఆమె మెడలో వున్న పచ్చల పతకం ఒకటి ఎగిరెగిరి పడుతున్నది.

ఆ పచ్చల పతకంమీద ముద్రించివున్న చిన్నబొమ్మ, వారు వెతుకుతున్న వుత్సవ విగ్రహం మాదిరిగానే వుంది.

* * *

చెరసాల తలుపులు తెరిచిన సవ్వడి వినగానే, లేచి కూర్చున్నారు షాడో ముఖేష్ లు.

ఇద్దరు సైనికులు లోనికివచ్చి, వారిని తమతో రమ్మనమని సైగచేశారు. బయట మరో పదిమంది సైనికులు ఆయుధాలతో సిద్ధంగా వున్నారు. వారిమధ్య అడుగులు వేస్తూ రాజసభకు వెళ్ళారు స్నేహితులు యిద్దరూ.

కిటకిట లాడిపోతున్నది రాజసభ. అంతకుముందు రోజు అంతమంది ప్రజలు లేరక్కడ.

ఒకవైపు సైనికాధికారులు, వరుసల్లో నిలబడివున్నారు. మహారాజు సింహాసనం వెనుక బారులు తీర్చి కూర్చుని వున్నారు అంతఃపుర కాంతలు.

షాడో ముఖేష్ లను ఒక ప్రక్కగా నిలబెట్టి చుట్టూ నిలబడ్డారు కారాగారపు సిబ్బంది.

మహారాజు వారివైపు చూడనేలేదు. అసలు రాజసభలో ఎవరూ షాడో ముఖేష్ లను గమనించలేదు. అందరి దృష్టి... సభమధ్యలో నిలబడివున్న దృఢకాయులమీదే వుంది.

"...... ముష్టి యుద్ధంలో మమ్మల్ని మించినవారు లేరు గదా యుద్ధంలో మాకు సరిజోడీ యీ దేశంలో మరి కనిపించడు... కత్తిసాము కర్రసాము మాకు పుట్టుకతోనే అలవడిన విద్యలు ... మీ చిత్రదుర్గంలో మమ్మల్ని జయించగల వీరులంటే ముందుకు రమ్మన మనండి, లేదా మాకు జయపత్రాన్ని యిచ్చి, కనకాభిషేకాన్ని చేయించండి" తొడచరిచి, మీసాలు మెలిపేస్తూ ప్రకటిస్తున్నాడొక దృఢకాయుడు.

సభలో కలకలం చెలరేగింది. సభికుల వదనాలు ఆవేశంతో అరుణవర్ణాన్ని పులుముకుంటున్నాయి.

మహారాజు మహామంత్రివైపు చూశాడు. మహామంత్రి సైనికాధికారులకు సైగచేశాడు.

వెంటనే ఒక సైన్యాధిపతి ముందుకువచ్చి, దృఢకాయులను ఎదుర్కున్నాడు.

ముష్టి యుద్ధం ప్రారంభమయింది. భారతీయ సాంప్రదాయం ప్రకారం రెండు చేతులను ఒకటిగా చేర్చి ఒకరినొకరు హింసించుకోసాగారు.

సైనికాధికారి దెబ్బకు ప్రత్యర్థి తడబడినప్పుడల్లా జయజయ ధ్వనులతో మార్మోగిపోతున్నది రాజసభ. ప్రత్యర్థి దెబ్బకు సైనికాధికారి తల్లకిందులైనప్పుడు నిట్టూర్పులతో నిండిపోతుంది.

ఎంతోసేపు కొనసాగలేదా పోరాటం. పది నిముషాలలో అంతం అయిపోయింది. రక్తసిక్తమైన వదనంతో మూర్ఛపోయాడు సైనికాధికారి. విజయం, సవాలుచేసిన దృఢకాయులకే లభించింది.

"ఇంకెవరైనా వున్నారా?" భీకరంగా అరిచాడా దృఢకాయుడు.

"ఇంకెవరుంటారు! అపరిమిత బలసంపన్నుడైన కార్తికేయుడే మూర్ఛపోయాడు వారి ధాటికి తట్టుకోలేక!" గుసగుసలుపోయారు సభికులు.

ఈసారి చిత్రదుర్గ సర్వసైన్యాధిపతి అయిన కాళింగుడు తనగద తీసుకొని అతన్ని ఎదుర్కొన్నాడు.

ఖంగు ఖంగుమంటూ మోతలు చేయసాగాయా యినుపగదలు. వాటి బరువుకు, పోరాటం కొనసాగిస్తున్న వారిద్దరూ తూలి పక్కలకు వరుగుతున్నారు.

పది నిముషాలపాటు ఒకరికొకరు తీసిపోకుండా పోరాడారు వారిద్దరూ. ఉన్నట్లుండి ... వెనక్కుతూలాడు దృఢకాయుడు. సైన్యాధిపతి కాళింగుడు భీకరంగా సింహనాదంచేసి గదఎత్తి అతని తలమీద మోదబోయాడు.

నేర్పుగా తల ముందుకువంచి, ఆ దెబ్బను కాచుకున్నాడా దృఢకాయుడు. సైన్యాధిపతి గదను వెనక్కి లాగుకునేలోగా తన గదతో అతని భుజాలమీద చరిచాడు.

మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడు సైన్యాధిపతి. ఆయన చేతిలోని గద జారి క్రింద పడిపోయింది.

హాహాకారాలతో నిండిపోయింది రాజసభ. అల్లకల్లోలమైపోయింది విషాద సూచకమైన అరుపులతో.

"మహారాజా! చూశారుగదా మా ప్రతాపం ... మిగిలిన విద్యలను కూడా ప్రదర్శిస్తాం... మా ధాటికి తట్టుకుని నిలబడగల వారిని ముందుకు రమ్మన మనండి ... వెంటనే కనకాభిషేకానికి ఏర్పాట్లు చేయించండి." మీసాలు మెలిపేస్తూ మహారాజుతో అన్నాడు దృఢకాయులకు నాయకుడుగా కన్పిస్తున్న వ్యక్తి.

మహారాజు ముఖం అవమానంతో కందిపోయింది.

"చూడు గురూ ... బాగా చూడు ... షాడో చెవిలో అన్నాడు ముఖేష్ పెద్ద మొనగాళ్ళల్లా వుపన్యాసాలు యిచ్చారు ఆ యువరాజు, మంత్రికుమారుడు, దళపతి ... దేబె ముఖాలు వేసుకొని చూస్తున్నారు ... ఒక్కడుకూడా ముందుకురాడేం?" అన్నాడు, యువరాజువైపు చూపిస్తూ షాడో వదనం ఆలోచనలతో అతి గంభీరంగా వుంది.

"ముఖేష్ ... మనం పోటీలో పాల్గొందాం ..." అన్నాడు ఒక నిశ్చయానికి వచ్చి.

"వద్దు రాజూ! అనవసరంగా వీళ్ళ వ్యవహారాల్లో మనం తల దూర్చద్దు. మనం యిక్కడినుండి వెళ్ళిపోదాం... మన పని మన కోసం ఎదురు చూస్తోంది ... ఆలస్యం అయిన కొద్దీ ఆ విగ్రహం చేతులు మారే అవకాశం వుంది. లేనిపోని గొడవల్లో తల దూరిస్తే ఈ సారి కందకంలో పడి యాకంగా పురాణ యుగంలోకి అడుగు పెట్టగలం. ఎందుకొచ్చిన బాధలు యివి. అసలే నాకు ఆరోగ్యం కూడా ఏమంత బాగోలేదు." అన్నాడు ముఖేష్.

"ముఖేష్ మన పనికి సంబంధించింది కాబట్టే - యీ వుద్యోగానికి గుడ్ బై చెప్పద్దని అంటున్నాను. పోరాట సమయంలో వీలు చేసుకుని అంతఃపురకాంతల సమీపంలోకి వెళ్ళాలి. రాజనర్తకి నళినీదేవి మెడలో వున్న పచ్చల పతకాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి ..." అన్నాడు షాడో.

ఉలిక్కిపడి షాడో ముఖంలోకి చూశాడు ముఖేష్. "వాట్ డూ యూ మీన్?" అంటూ ఆశ్చర్యంగా కనుబొమ్మలు ఎగురవేశాడు.

నవ్వుతూ తలవూపాడు షాడో - "మనం ద్వారపాలకులుగా కాదు మంచి పదవిలోకి పోవాలి. పరపతి పెంచుకొని నెమ్మదిగా పరిశోధన ప్రారంభించాలి" అంటూ.

మహారాజు, మహామంత్రి ఒకరితో ఒకరు అతిరహస్యంగా మాటాడుకుంటున్నారు. సభికులు తగ్గుస్వరాలతో తమలో తాము గుసగుసలు పోతున్నారు.

తొడలు చరిచి, మీసాలు మెలిపేస్తూనే వున్నారు ఆ దృఢకాయులు. తమను ఎదురించేవారు లేరన్న గర్వం ... అహంకారం వారిని నిలువెల్లా ఆవరించినట్లుంది - సభనంతా కలియ చూస్తూ, ప్రతి సైనికుణ్ణి , ప్రతి సభికుణ్ణి "నువ్వు నువ్వు" అంటూ పోరాటానికి ఆహ్వానిస్తున్నారు.

వారి దృష్టి అటు తిరిగి యిటు తిరిగి షాడో ముఖేష్ లు నిలబడి వున్న ప్రదేశంవైపు ప్రసరించింది.

"ఏమలా రాతిబొమ్మల్లా నిలబడ్డారు! మాతో చేయి కలిపే దమ్ముందా?" తొడచరుస్తూ అన్నాడో దృఢకాయుడు.

"అన్నాయ్ ... కొంచెం పక్కకి తొలగి దారియిస్తావా?" తమకు అడ్డు నిలబడిన, కారాగార సైనికుణ్ని అడిగాడు ముఖేష్.

"మీరు మీరు వారిని ఎదుర్కుంటారా?" ఆశ్చర్యంగా అన్నాడతను.

"చూడన్నాయ్ !...మీరు అంతా చూసి మాట్లాడండి..." అంటూ అతని పక్కనుంచి సందు చేసుకొని ముందుకు పోయాడు ముఖేష్

ఊతకర్ర సాయంతో కుడికాలిని ఎత్తి ఎత్తి వేస్తూ అతన్ని అనుసరించాడు షాడో.

వారిద్దరూ సభ మధ్యకు రావటంతో - ఒక్కసారిగా నిశబ్దం ఆవరించిందా ప్రదేశాన్ని.

మహారాజు - మహామంత్రి తలలు ఎత్తి చూశారు.

"మీరా! మమ్మల్ని ఎదుర్కొనే ధైర్యం మీలోవుందా?" షాడో, ముఖేష్ లు ధరించి వున్న ద్వారపాలకుల దుస్తుల్ని చూసి హేళనగా అన్నాడు దృఢకాయుల నాయకుడు.

సమాధానంగా తొడ చరిచి, రెండు గంతులు వేసి, తన పెన్సిల్ కట్ మీసాన్ని చూపుడు వేలితో సున్నితంగా మీటాడు ముఖేష్.

దృఢకాయుడొకడు భయంకరంగా అరిచి ముందుకు వచ్చాడు. అంతకు ముందు కార్తికేయుడనే సైన్యాధిపతితో ముష్టి యుద్ధం చేసింది అతనే.

"అతన్ని దగ్గిరికి రానిచ్చి ... ఎగిరి గుండెల మీదతన్నాడు ముఖేష్ వెనక్కు పడ్డాడు దృఢకాయుడు.

"అక్రమ పోరాటమిది...దొంగదెబ్బ తీస్తున్నారు...చూస్తారేం!" అంటూ అరిచాడు దృఢకాయుల నాయకుడు.

అతని అనుచరులు అందరూ ఒక్కసారిగా ముందుకు వచ్చారు. అదిచూసి "అన్యాయం ... అక్రమం " అని కేకలు పెడుతూ లేచారు చిత్రదుర్గ పౌరులు అందరూ.

వారి అరుపులను లక్ష్యపెట్టకుండా ముందుకుపోయాడు షాడో, గదను పైకి ఎత్తి ముఖేష్ మీదికి పోతున్న దృఢకాయుడికి, తన వూతకర్రను అడ్డుపెట్టాడు.

"అరేయ్ అంగవహీనుడా ... అడ్డు తొలగకపోతే నీ శిరస్సు వెయ్యి ముక్కలౌతుంది!" గర్జించాడా దృఢకాయుడు.

అతని మాట పూర్తి అయిన మరుక్షణం కర్రను కింద ఆనించి, గాలిలోకి ఎగిరాడు షాడో. ఎడమ కాలితే అతని నోటిమీద తన్నాడు బలంగా.

బాధగా అరుస్తూ వెనక్కి విరుచుకుపడ్డాడతను. ముందుపళ్ళు రెండు రాలిపోయాయి. నోటినుండి వెల్లువలా కారసాగింది రక్తం.

అంతటితో మాటలతో బలప్రదర్శనం చేయటం అంతమయి పోయింది. దృఢకాయులందరూ కలిసి, తమ తమ ఆయుధాలతో షాడో ముఖేష్ లను చుట్టుముట్టారు.

న్యాయమైన యుద్ధం కాదది దొమ్మీ యుద్ధం. అందులో బలం కలవాడికే లభిస్తుంది విజయం.

ఎడమ కాలిమీద బరువును మోపి గిరగిరా తిరుగుతూ వూతకర్రను బాణాకర్రలా తిప్పసాగాడు షాడో,

ఇంతలో గద పట్టుకొని వున్న వ్యక్తిని పడగొట్టి, తను అతని గదను అందుకున్నాడు ముఖేష్. దాన్ని బేస్ బాల్ బాట్ లాగా వూపుతూ అడ్డువచ్చిన వారిని తుక్కుతుక్కు కింద బాదటం ప్రారంభించాడు.

కర్ర తిప్పుతున్న షాడో మెల్లిగా సింహాసనం వైపు జరగటం మొదలుపెట్టాడు.

దృఢకాయుల నాయకుణ్ని గదతో కొట్టడానికి ప్రయత్నించాడు ముఖేష్. అతను తల వంచి ఆ దెబ్బ నుంచి తప్పుకోవటంతో —

గద విసురుకు నిలబడటం కష్టమై గదతో పాటు వెళ్ళి రాజుగారి సింహాసనం పక్కన పడ్డాడు ముఖేష్.

అంతవరకూ ఆత్రుతగా చూస్తున్న సభికులు ఒక్కసారిగా చప్పట్లు చరిచి పెద్దగా నవ్వేశారు.

వారు నవ్విన కొద్దీ - మరింతగా నవ్వించాడు ముఖేష్. లేచి గదను ఎత్తబోయి - మళ్ళీ కింద పడ్డాడు దాని బరువును భరించలేక దొర్లుకుంటూ సింహాసనపు వెనుక భాగాన్ని చేరుకున్నాడు.

అతని వికారపు చేష్టలకు పమిట చెంగులు నోళ్ళకు అడ్డం పెట్టుకొని నవ్వుతున్నారు అంతఃపుర కాంతలు. అతనికి తమ పాదాలు తగలకుండా లేచి వెనక్కు జరిగి నిలబడ్డారు.

మెల్లిగా లేచి, గదను భుజం మీద వేసుకొని చుట్టూ చూశాడు ముఖేష్ నళిని అతనికి సమీపంలోనే వున్నది. ఆమె మెడలో ప్రేలాడుతున్న పచ్చలపథకం - దాని మీది దేవీ విగ్రహపు చిత్తరువు కొట్టవచ్చినట్లు కనిపించాయి.

సింహాసనం ముందు దృఢకాయులందరూ షాడోని చుట్టుముట్టి వున్నారు. వారిలో ఒకవ్యక్తి పొడగాటి తన బరిశెతో షాడో తొడల మీద కొట్టాడు శక్తినంతా వుపయోగించి.

కాలు మడతబడి కిందపడిపోయాడు షాడో. మరుక్షణం తమ ఆయుధాలను పైకి ఎత్తి అతన్ని కుమ్మివేయడానికి సిద్ధపడ్డారు దృఢకాయులందరూ.

సభికులు ఘొల్లుమన్నారు ఒక్కసారిగా. అంతఃపురకాంతలు హాహాకారాలు చేశారు. మహారాజు సింహాసనం మీదినుంచి లేచి నిలబడ్డాడు.

* * *

షాడో కిందపడటం చూడగానే ఒక్కసారిగా గాలిలోకి డైవ్ చేశాడు ముఖేష్ . అంతవరకు అది బరువుగా వున్నట్లు అందర్నీ

నమ్మిస్తున్న గదను అవలీలగా భుజం మీద వేసుకుని - ఆంజనేయుడిలా పోయి దృఢకాయుల మీదపడ్డాడు.

కిందపడిన షాడో ... లేచి నిలబడటానికి ప్రయత్నిస్తున్నాడు.

"రాజు ... పతకంలో వున్నది మన విగ్రహమే ... ఇప్పుడేం చేద్దాం?" దృఢకాయులను గదతో విదిలించి కొడుతూ అన్నాడు ముఖేష్.

ఆ మాట వినగానే - చటుక్కున లేచాడు షాడో. అంతవరకూ కిందమోపటానికి వీలుకాకుండా పోయిన కుడికాలు తగిలిన దెబ్బతో తిరిగి యధాప్రకారం స్వాధీనంలోకి వచ్చింది.

నిఠారుగా నిలబడి చుట్టూ చూశాడు. సర్వసైన్యాధికారి కళింగుడి గద ఒక పక్కగా కనిపించేసరికి - రెండంగల్లో పోయి దాన్ని అందుకున్నాడు.

షాడో కాలు నయం అవటం చూసేసరికి ముఖేష్ సంతోషానికి మేరలేకుండా పోయింది. పెద్దగా సింహనాదం చేసి మరింత విజృంభించాడు.

గదను గాలిలో గిరగిరా తిప్పాడు షాడో, సమీపంలోకి వచ్చిన ఒక దృఢకాయుడి పిర్రలమీద బలంగా తాకించాడు.

ఆ దెబ్బకు ఆరు అడుగుల ఎత్తున గాలిలోకి లేచాడతను. ఎగురుకుంటూ పోయి సింహాసనం మీదపడ్డాడు.

సందులో సందు చేసుకొని యువరాజు కూర్చున్న ప్రదేశానికి వెళ్ళాడు ముఖేష్. ప్రత్యర్థిని కొట్టబోయి - తూలినట్లు తూలి యువరాజు వీపుమీద తలతో పొడిచాడు.

ముందుకు తూలిన యువరాజును తన పిడికిలి పోటుకు గురిచేశాడు ఒక దృఢకాయుడు.

తను గూడా మరో దెబ్బ వేద్దామని అనుకున్నాడు ముఖేష్. కాని అదేక్షణంలో పోరాటం అంతమయిపోయింది తమ ప్రత్యర్థుల నాయకుణ్ని, మరో యిద్దరు దృఢకాయుల్ని రెండు దెబ్బలతో నేలకూల్చాడు షాడో.

మిగిలిన ముగ్గురూ ఆయుధాలను కిందపారవేసి చేతులు గాలిలోకి ఎత్తారు - ఓడిపోయామని సూచిస్తూ-

హర్షధ్వానులతో పిక్కటిల్లి పోయింది రాజసభ. సభికుల్ని ముందుకు రానీయకుండా ఆపటం చిత్రదుర్గ సైనికులకి సాధ్యపడలేదు. గట్టు తెగిన ప్రవాహంలావచ్చి స్నేహితులు యిద్దర్నీ చుట్టుముట్టారు సభికులు. చేతులమీద ఎత్తి జయజయ ధ్వానాలు చేశారు.

* * *

"బాబాయ్! నళినిదేవి గురించి చెప్పు వింటాను ..." మంచంమీద వెనక్కువాలి కూర్చుంటూ అడిగాడు ముఖేష్.

షాడో ఒక పక్కన పడుకొని నిద్రపోతున్నాడు మండువాలో కూర్చుని వున్నాడు భూపతి.

"చెప్పటానికి ఏముంది? ఆమె మన రాజనర్తకి" అన్నాడు ముఖేష్ మాటకు సమాధానంగా

"రాజనర్తకి అన్న సంగతి నాకు తెలుసు ... ఆమె వంశం, తల్లిదండ్రులు ఎవరు ఏమిటి, మొదలైన వివరాలు కావాలి!" మళ్ళీ రెట్టించి అడిగాడు ముఖేష్.

"ఆ వివరాలు మన నిశంభుడికి తెలుసు అతన్ని అడుగుదాం" అన్నాడు భూపతి.

మాటల్లోనే వచ్చాడు నిశంభుడు. వచ్చీ రావటంతోనే ముఖేష్ ని మంచం మీదినుంచి కిందికి లాగి గాఢంగా కౌగిలించుకున్నాడు.

"ముఖేష్! నువ్వు, నీ స్నేహితుడు మాదేశం రావటం నిజంగా మా అదృష్టం. మీలాంటి మహావీరులను కొలువులో చేర్చినందుకు నన్ను పిలిపించి మెచ్చుకున్నారు మహారాజు. యువరాజుతో ఘర్షణ పడిన సందర్భాన్ని మరిచిపోతున్నట్లు వెల్లడించారు. నేటి నుండి మీరు సామాన్యమైన ద్వారపాలకులు కాదు. దుర్గరక్షకబృందంలో దళాధిపతులు" అన్నాడు ఆనందంగా.

"నేను చెప్పలా!! మట్టిలో దాచబడిన మాణిక్యాలు. ఎంతోకాలం మరుగునపడివుండవు. చిచ్చరపిడుగుల్లాంటి యీ వీరయువకుల్ని

ఏమూల దాచినా వీరి వీరత్వం బయటికి రాకమానదు!" ఆనంద భాష్పాలు విడుస్తూ అన్నాడు భూపతి.

"మిత్రమా... నళినిదేవి చరిత్ర తెలుసుకోవాలని వుంది చెప్పగలవా?" మెల్లిగా తన ప్రశ్నను వెల్లడించాడు ముఖేష్.

"అదొక విషాదగాధ ముఖేష్! నళినీదేవి సామాన్యమైన నర్తకి కాదు. రాచవంశంలో పుట్టి - విధి వక్రించటం వల్ల యిలా నర్తకిగా జీవిస్తుంది" గాఢంగా నిట్టూరుస్తూ అన్నాడు నిశంభుడు.

"ఏమయింది? ఆమె తల్లిదండ్రులను శత్రువులు హతమార్చారా? లేక ఏదైనా దాఋణ శాపానికి గురియై యిలా వంటరిగా జీవిస్తున్నదా?" అని అడిగాడు ముఖేష్.

"శాపం అంటూ ఏమీలేదు. కాని ఆమె చరిత్ర వింటే ఎవరికైనా కళ్ళనీళ్ళు తిరుగుతాయి. ఇక్కడికి రెండువందల క్రోసుల దూరంలో చిత్ర పర్వతపంక్తి వుంది. అడవులు, సెలయేళ్ళు, అర్థంకాని వింత ప్రాణులతో నిండివుంటుందా ఆ ప్రాంతమంతా. ఆ చిత్రపర్వతాలమీద అతి పురాతమైన కాళికాలయం ఒకటి వుంది. ఆ ఆలయ సంరక్షణ భారాల్ని వహించిన ధర్మకర్త కుమార్తె మన నళినీదేవి ఒకసారి —" అంటూ ఆగిపోయాడు నిశంభుడు.

"ఏమయింది?" ఆత్రుతగా అడిగాడు ముఖేష్.

అదే సమయంలో బయట నిలబడి వున్న నిశంభుడి అనుచరులు లోపలికి పరుగెత్తుకువచ్చారు.

"రాజకుమారి రంజని, రాజనర్తకి నళిని ఉద్యానవనానికి విహారానికి వెళ్ళి తిరిగిరాలేదుట. ఎవరో వారిని అపహరించుకు పోయారట!" అని విన్నవించారు.

అదిరిపడి లేచాడు నిశంభుడు "తర్వాత కలుస్తాను ... అన్ని విషయాలు నెమ్మదిగా చెప్తాను" అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

వెంటనే షాడోని నిద్రలేపి ఆ వార్తను వెల్లడించాడు ముఖేష్. "సరిగ్గా మనకు ఏదో దారి కనిపిస్తుందనుకుంటున్న సమయంలో నేనా యీ విపత్తు రావటం!" అంటూ లేచాడు షాడో.

పదిక్షణాలలో యిద్దరూ కలిసి రాజభవనం దగ్గిరికి వెళ్ళారు. సైనికులు హడావిడిగా తిరుగుతున్నారు అటూయిటూ. ఎవరి నోటవిన్నా ... రాజకుమారి, నళినీదేవిని అపహరించిన వారిమీద నిందాలాపాలే వినవస్తున్నాయి —

"చీమకు కూడా అపకారం తలపెట్టని చిన్నారులు వారు క్రింద కాలు పెడితే కందిపోయే సుకుమారులు ... ఎన్ని బాధలు పడబోతున్నారో ఏ దుర్మార్గుడు యీ దురాగతాన్ని జరిపించాడో!" అంటూ.

అనేకమంది అశ్వికులు నాలుగు దిశలకూ పయనమైపోయారట. వారు తిరిగివస్తేకాని అన్ని విషయాలు వివరంగా తెలియవు.

ఉద్యానవనం ముందు సైనికులు గుంపులు గుంపులుగా నిలబడివున్నారు.

"మనం లోపలికి పోయి వాళ్ళు మాయమైన ప్రదేశాన్ని పరిశీలించి వద్దాం" సజెస్ట్ చేశాడు ముకేష్.

ఉద్యానవనంలో మహారాజు, మహామంత్రి మొదలైన వారందరూ ఒక మండపంముందు సభతీర్చి వున్నారు.

"మహామంత్రీ ... ఆ దుర్మార్గులను బంధించి నా కుమార్తెను, నళినీ దేవినీ సురక్షితంగా తీసుకువచ్చినవారికి బహుమతి యిస్తామని ప్రకటించండి. సస్యశ్యామలమైన చిత్రదుర్గ రాజ్యంలో - వారు కోరుకున్న గ్రామాలకు మండలాధిపతిగా నియమిస్తామని ప్రచారం చేయించండి..." అంటున్నాడు మహారాజు.

వారిని దాటి ముందుకు పోయారు షాడో, ముఖేష్లు. ఒకచోట పాతికమంది సైనికులు ఆయుధాలతో నిలబడివున్నారు. వారిని ప్రశ్నించి, రాకుమారి, నళినీదేవి మాయం కావటానికి ముందుగా విహరించిన ప్రదేశాన్ని సమీపించారు.

ఒక పొదచాటున నలుగురు వ్యక్తులు - మోకరించి కూర్చున్న జాడలు కనిపించాయి. చాలాసేపు వేచియున్నారు కాబోలు - వారి మోకాలి ముద్రలు అటూ యిటూ చెదిరి వున్నాయి.

వాటికి నాలుగు అడుగుల దూరంలో ఏదో గడబిడ జరిగినట్లు నేలంతా పాదముద్రలతో నిండివుంది.

ఆ ప్రదేశానికి సమీపంలో వున్నదొక చిన్న గోరింటపొద. ఆ పొద రెమ్మల్లో - ఒక గుడ్డముక్క కనిపించింది ముఖేష్ కి.

"ఇది ... ఇది మన దృఢకాయుల పని అయివుంటుంది రాజు ... గద పట్టుకొని గంతులు వేసిన దృఢకాయుడు ఇదే రంగు దట్టిని నడుముచుట్టూ చుట్టుకొని వున్నాడు" అన్నాడు దాన్ని షాడో చేతికి అందిస్తూ.

తలవూపాడు షాడో. ఇద్దరూ ఉద్యానవనాన్ని దాటి రాజభవనాల ముందుకు వచ్చారు.

నిశంభుణ్ని వెతికి పట్టుకోవాలని షాడో ఆలోచన. నిశంభుడు హడావుడిగా తిరుగుతున్నాడు, ఒక పట్టాన వారికి కనిపించలేదు.

చీకటి పడబోతున్న సమయంలో అతన్ని పట్టుకొని అవతలికి తీసుకుపోయాడు షాడో.

"అవును.... ఆ దృఢకాయులు రణదుర్గానికి చెందినవారే. రణదుర్గాధిపతికి మనకూ సరిపడదు..." అన్నాడు షాడో ప్రశ్నకు సమాధానంగా.

"రణదుర్గం చాలా పటిష్టమైన రాతికోట. లక్షమంది సైనికులు పోయి చుట్టుముట్టినా దాన్ని వశపరుచుకోవటం అసంభవం. అందులో ప్రవేశించటం అన్నది అనుమతి లేకుండా జరగని పని" అన్నాడు రణదుర్గాన్ని గురించి తెలియచేస్తూ.

షాడో మరికొన్ని వివరాలు తెలుసుకోవాలని అనుకున్నాడు గాని నిశంభుడు "నాకు పని వుంది ..." అంటూ వెళ్ళిపోవటంతో, తన ప్రశ్నలను తనలోనే దాచుకొని వెనుతిరిగాడు.

భూపతి యింటిదగ్గిరే వున్నాడు. షాడో, ముఖేష్ లను చూడగానే ఎదురువచ్చాడు.

"బాబాయ్ ! ఈ విషయం నువ్వు బయటికి చెప్పకూడదు మాకు వెంటనే రెండు గుర్రాలు కావాలి. బలమైన తాళ్ళు కావాలి..." అన్నాడు ముఖేష్ .

"రెండు కాదు మూడు " అన్నాడు షాడో.

ఎందుకని అడగబోయి తమాయించుకున్నాడు భూపతి. ఆసరికి అతనికి షాడో ముఖేష్ ల వ్యవహారం బాగా అర్ధమైంది. వాళ్ళు ఏదో పధకం వేస్తున్నారని గ్రహించి వారడిగినవి సేకరించటానికి బయలుదేరాడు.

"రాజు ... మూడు గుర్రాలు దేనికి?" ఆశ్చర్యంగా అడిగాడు ముఖేష్ .

"ఒకటి నాకు ...మిగిలిన రెండూ రాజకుమారి, నళినీదేవి ప్రయాణించటానికి"

"మరి నేను? నడిచి రమ్మంటావా?"

"నువ్వు నడిచి రానవసరం లేదు. ఇక్కడే వుంటావ్ ఇక్కడి పరిస్థితులను ఒక కంట కనిపెడుతూ వుండాలి!"

"అన్యాయం ... అక్రమం" అనబోయాడు ముఖేష్.

అదే సమయంలో అంతఃపురం నుంచి ఒక పరిచారిక వచ్చి చంద్రికతో ఏదో చెప్పింది.

ఆమె ముఖేష్ ని పిలిచి "అన్నాయ్...రాణీగారు చాలా విచారంగా వున్నారట. ఆమెను సంతోషపరిచే విధంగా మాట్లాడి ధైర్యం చెప్పటం నీ ఒక్కడివల్లే అవుతుందని మహామంత్రి కబురు పంపించారు" అన్నది.

చిరునవ్వు నవ్వుతున్న షాడో వంక కోపంగా చూసి దాసీ వెంట బయలుదేరాడు ముఖేష్ - "జాగ్రత్త రాజా ... మూడురోజుల లోపల నువ్వు తిరిగి రాకపోతే - నేను కూడా బయలుదేరతాను ..."అంటూ.

* * *

మూడు గుర్రాలను తీసుకువచ్చాడు భూపతి. పొడుగుపాటి మోకులను గూడా తెచ్చియిచ్చాడు.

భూపతి అంగీలను వదిలి - పాంటు షర్టు ధరించాడు షాడో. బూట్స్ వేసుకొని - డాగర్ ని కుడికాలి బూటులో వున్న ప్రత్యేకమైన అరలో దాచాడు. భూపతి దగ్గిర వున్న పటకా కత్తులలో మంచి కత్తిని ఒకదాన్ని తీసుకొని పాంటు బెల్టు వెనుక వేలాడతీశాడు.

అంతవరకూ ఎవరూ చూడకుండా దాచిన రివాల్వర్ ని తీసి బుల్లెట్లను సరిచూసుకున్నాడు.

"ఏమిటన్నాయ్ అది?" ఆశ్చర్యంగా అడిగింది చంద్రిక.

సమాధానంగా నవ్వి - రివాల్వర్ ని బెల్టు వెనుక దాచాడు షాడో. భూపతి అందించిన మోకులను జాగ్రత్తగా చుట్టలు చుట్టి ఒక గుర్రపు జీనుకు తగిలించి - తన అశ్వాన్ని అధివహించాడు.

"అన్నయ్యా ! జాగ్రత్త!!" అంటూ వీడ్కోలిపింది చంద్రిక.

భూపతి నగరద్వారం వరకూవచ్చి వీడ్కోలు యిచ్చాడు. నగర ద్వారాన్ని సమీపించాడు షాడో. మిగిలిన రెండు గుర్రాలను తన అశ్వం ముందు పరిగెత్తిస్తూ రణదుర్గం వైపు పోనిచ్చాడు.

* * *

"మహారాణీవారు ఇలా పరాకుగా వుండటం ఏమీ బాగోలేదు, మీరే యిలా దిగులుపడితే - మాలాంటి వారి సంగతి యింకెలా వుంటుంది? వీరమాతలు, వీరపత్నులు మీరు ... సామాన్యులులాగా బెంబేలు పడకూడదు..."

అంతఃపురంలో అడుగు పెడుతూనే అందుకున్నాడు ముఖేష్ .

మహారాణి - అంత విచారంలోనూ ... అతన్ని చూసి చిరునవ్వు నవ్వింది.

"మహారాణివారు ఓ కథ వింటరా? చక్కటి కథ ... అనగా అనగా ఒక రాజు వుండేవాడు ... ఆ రాజుకు-" అంటూ కథ మొదలుపెట్టాడు ముఖేష్ .

"ఏడుగురు కొడుకులు" అంటూ అందుకుంది మహారాణిగారి యిష్టసఖి ఒకర్తె.

"కాదు ... ఏడుగురు కూతుళ్ళు!"

ఫక్కున నవ్వారందరూ ... మహారాణి వదనం కొంచెం తేటపడింది.

"ఆ ఏడుగురూ వేటకు వెళ్ళారు ... ఎందుకో తెలుసా!" అడిగాడు ముఖేష్ .

ఆ పైన అతిపురాతనమైన ఆ ఏడుగురు రాజకుమారులు - ఏడుచేపల కథను అతనికి చెప్పే ప్రయత్నం ఎవరూ చేయలేదు ఏ మాట అంటే ఆ మాటను మారుస్తాడని గ్రహించి మిన్నకున్నారందరూ.

"ఏడుగురు రాకుమార్తెలు అడవికి వెళ్ళారు - భర్తలను వేటాడటానికి. పగలంతా తిరిగి తిరిగి ఏడుగురు రాకుమారులను పట్టుకున్నారు. ఆ రాకుమారులు కూడా వేటకే వచ్చివున్నారు. అయితే వారు మాత్రం

న్యాయం ప్రకారం చేపలకోసమే తిరుగుతున్నారు!" చెప్పుకుపోయాడు ముఖేష్ .

అందరూ నవ్వుతున్నారు ... ఆ నవ్వుల సందడిలో మహారాణి తన విచారాన్ని కొంతవరకూ మరిచిపోగలగింది. హంసతూలికా తల్పం మీదినుంచి లేచివచ్చి ఒక ఆసనం మీద కూర్చుంది.

ఆ సమయంలో, ఆమె పయ్యద కొలదిగా పక్కకు తొలగింది. ధగధగ లాడుతున్న పచ్చల పతకం ఒకటి ముఖేష్ కనుల పడింది.

దాని మీద కూడా ముద్రించి వుంది - వారు వెతుకుతున్న దేవీ విగ్రహపు చిత్తరువు.

ముఖేష్ నోరు అప్రయత్నంగా కథలు చెప్పుకుంటూనే పోతున్నది. అతని మనస్సు మాత్రం - రాణీగారి మెడలోని పచ్చల పధకం మీదే వుంది. ఒకే ఒక క్షణం కనిపించిందది. మరుక్షణం పయ్యెద చాటున మరుగుపడి పోయింది. దాన్ని చేజిక్కించుకుంటే -తమ అనుమానాలకు సమాధానం లభిస్తాయోమో!

చెప్పిన కథ చెప్పకుండా చాలాసేపు మహారాణిగారికి వినోదాన్ని కలుగచేశాడు ముఖేష్. అతని మాటలు వింటూనే నిద్ర పోయిందామె.

పరిచారికుల సైగ అందుకొని కథాకాలక్షేపాన్ని విరమించాడు ముఖేష్ . ఒక పరిచారిక దోవ చూపిస్తుండగా అంతఃపురంలోనుంచి వెలుపలికి వచ్చాడు.

"ఈ దోవగుండా పోతే కొలువుకూటపు ముఖద్వారాన్ని చేరుకుంటావ్ ..." అంటూ ఒక దారిని చూపించి వెనుతిరిగిందామె.

అప్పటికి అర్ధరాత్రి అయింది. ఆ ప్రదేశమంతా నిర్జన్యంగా నిశబ్దంగా వున్నది. రాణీగారి పరిచారిక వెనుతిరిగి అంతఃపురంలోకి పోగానే - తను గూడా పక్కకు తిరిగి భవనం చాటుకు వెళ్ళాడు ముఖేష్.

నీడలలో నడుస్తూ - ద్వారాలకు పహారా యిస్తున్న దాసీలకు కనిపించకుండా అడుగు అడుగు చొప్పున ముందుకు పోయి మహారాణీవారి భవంతిని సమీపించాడు.

భవన ద్వారం ముందు బరిశెలు పట్టుకున్న యిద్దరు స్త్రీలు పహారా యిస్తున్నారు. వారిని దాటిపోవాలి - ఏ మాత్రం పసికట్టినా నిలువుగా నరికి ముక్కలు చేస్తారు వారు.

రెండు క్షణాలు యోచించి - ద్వారానికి ఎదురుగా వున్న పొదలలోకి వెళ్ళాడు ముఖేష్.

"రక్షించండి...రక్షించండి..." అని అరిచాడు అంతఃపురదాసీ మాదిరిగా గొంతు మార్చి.

ఉలిక్కిపడి అతనున్న పొదవైపు చూశారు వారిద్దరూ. మరోసారి అరిచాడు ముఖేష్.

ఒక కాపలా స్త్రీ ద్వారం దగ్గిరే వున్నది. రెండవ స్త్రీ బరిశెను ముందుకు జాచి పట్టుకుని పొదవైపు వచ్చింది.

ఇద్దరూ వస్తారని ఆశించిన ముఖేష్ ...నిరాశ పొందాడు. పహారా ఎలా యివ్వాలి, ఏమిటి అన్న విషయాలు నాగరిక ప్రపంచం - పూర్వకాలపు వారిని చూసే నేర్చుకుంది. కొత్తగా కనిపెట్టింది ఏమీ లేదు.

పొదను సమీపించి - బరిశెతో ఆకులను పక్కకు తొలగించిందా కాపలామనిషి –

మెరుపులా ఆ బరిశెను పట్టుకొని ఆమెను ముందుకు గుంజాడు ముఖేష్ . తూలి పొదలో పడిందామె. వెంటనే మెడమీదికి చేతులను పోనిచ్చి - చెవికింద వున్న నరాన్నొకదాన్ని గట్టిగా నొక్కాడు ముఖేష్ క్షణాలమీద ఆమె స్పృహతప్పింది.

ఆమెను పొదచాటున పడుకోబెట్టి - రెండవ యువతి కూడా వస్తుందేమోనని ఎదురు చూశాడు ముఖేష్. ఆమె వున్న చోటునుంచి ఒక్క అంగుళం కూడా కదలలేదు. పైపెచ్చు నడుముకు వ్రేలాడుతున్న శంఖాన్ని తడుముకో సాగింది.

ఆలస్యం చేస్తే, ఆమె శంఖాన్ని వూది అందర్నీ పిలుస్తుందని గ్రహించి గబగబా స్పృహ తప్పిన యువతి దుస్తుల్ని వూడతీశాడు ముఖేష్ .

"సారీ డియర్ ... ఇలా చేయటం తప్పే ... కాని చేయగలిగింది ఏమీలేదు ...ఐయామ్ సారీ ..." అనుకుంటూ తన దోవతి ఆమె నగ్న శరీరం మీద కప్పి, ఆమె చీర తాను కట్టుకున్నాడు. ఆభరణాలను పెట్టుకొని, ఆమె తలపాగా చుట్టుకొని బరిశె పట్టుకొని బయలుదేరాడు.

చీకటిలో అతని ముఖం రెండవ యువతికి సరిగా కనిపించలేదు. "ఏమయింది? ఏమిటా అరుపు?" అని అడిగిందామె.

"ఇక్కడ కాదు .... కొలువుకూటం దగ్గిర అరుస్తున్నారెవరో ..." అంటూ ఆమెను సమీపించాడు ముఖేష్.

ముఖేష్ గొంతును వినగానే తన సహచరురాలు కాదు అని గ్రహించింది. గ్రహించిన మరుక్షణం ముఖంమీద చెయ్యివేసింది. వెంటనే ఆమె చెయ్యి పట్టుకున్నాడు ముఖేష్. బరిశెను క్రిందికి వదిలి ఆమె మెడమీద బలంగా చరిచాడు.

మైనపు బొమ్మలా అతని చేతుల్లోకి వాలిపోయిందామె. ఆమెను అలాగే గోడకు ఆనించి కూర్చోపెట్టి, గబాగబా లోనికి పోయాడు ముఖేష్. లోపల ద్వారాలలో కాపలా స్త్రీలు ఎవరూ లేరు. కాని ప్రతి గదిలోనూ ఎవరో ఒక పరిచారిక అడ్డదిడ్డంగా పడుకొని నిద్రపోతూ కనిపించింది.

ఒక్కొక్క గదినే దాటుకుంటూ మహారాణి శయన మందిరాన్ని సమీపించాడు ముఖేష్.

తలుపులు దగ్గిరికివేసి వున్నాయి. లోపల మహారాణి శయనించిన తల్పం చుట్టూ పడుకొని వున్నారు పదిమంది అంతరంగిక సఖీమణులు.

అడుగులో అడుగువేస్తూ ముందుకు పోయాడు ముఖేష్. తల్పాన్ని సమీపించి, జలతారు తెరలచాటున నిలబడి చుట్టూ చూశాడు. రెండవవైపున పెద్ద కిటికీ వుంది. దాని తర్వాత ఉద్యానవనం ...ఒకవేళ ఏమయినా గోల అయితే పారిపోవటానికి వుపయోగించవలసిన మార్గం అదే.

మృదువుగా తెరలను తొలగించి, మహారాణి పయ్యెద మీద చెయ్యి వేయబోయి వెనక్కు లాక్కున్నాడు ముఖేష్.

పతకం పయ్యెద చాటున వుంది. పయ్యెద తొలగిస్తే గాని దాన్ని తీయటం కుదరదు. రెండుక్షణాలు ఆగి మెల్లిగా పయ్యెదను పక్కకు లాగాడు. పతకాన్ని మెల్లిగా ఎత్తి, మహారాణి తల మీదినుంచి యివతలికి తీశాడు.

శయనమందిరంలో వెలుగుతున్న తైల దీపాల వెలుగుపడి వింతగా మెరిసిపోతున్నదా పతకం, పచ్చరాళ్ళ మధ్య మలచబడిన కలకత్తాకాళీ విగ్రహం నవ్వుతున్నట్లు కనిపించింది ముఖేష్ కనులకు.

పతకాన్ని పట్టుకొని మెల్లిగా యివతలకు వచ్చాడు ద్వారంవైపు అడుగులు వేస్తుండగా, భళ్ళున తెరుచుకున్నాయి తలుపులు.

"బంధించండి ..పారిపోవడానికి ప్రయత్నిస్తే నిలువుగా నరకండి" అంటూ లోనికి వచ్చాడు మహారాజు.

వెనుతిరిగి ఉద్యానవనంపైపు పరుగెత్తబోయాడు ముఖేష్ . కాని రాజభటులు చుట్టుముట్టి బరిశెలను వెన్నుకు ఆనించటంతో ఆగిపోయాడు.

* * *

రెండురోజులు ప్రయాణంచేసి రణదుర్గాన్ని చేరుకున్నాడు షాడో. పగలంతా దుర్గానికి దూరంలోనే వుండి ఆ పరిసరాలనన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించాడు.

రణదుర్గపు గోడలు యాభై అడుగుల ఎత్తున్నాయి. దుర్గం చుట్టూ లోతైన కందకం వుంది. ఒకే ఒక ద్వారం వున్నది ఆ దుర్గానికి. పెద్దపెద్ద యినుప తలుపులు అమర్చబడి వున్నాయి.

ఎవరైనా బయటికివస్తే, తలుపులు తెరిచి, వెంటనే మూసేస్తున్నారు. ఆ ఒక్క ద్వారం దగ్గిరే వందమంది సైనికులను లెక్కపెట్టాడు షాడో.

కోట గోడలమీద కూడా సైనికులు పహారా తిరుగుతున్నారు.

చిత్రదుర్గం మాదిరిగా, రణదుర్గంలో పట్టణంలేదు చిన్నకోట అది. ప్రత్యేకంగా రాజభవనాలను, రాజులను రక్షించటానికే కట్టబడినట్లుంది.

చీకటి పడేదాకా ఆగి మెల్లిగా ముందుకు అడుగువేశాడు షాడో. గుర్రాలను ఒక చెట్లతోపులో కట్టివేశాడు. మోకులను భుజానికి తగిలించుకొని నెమ్మదిగా కోట గోడలను సమీపించాడు.

గోడలమీద పగలు వున్నంత పహారాలేదు. ప్రతి పావుగంటకూ ఒకసారి దుర్గంచుట్టూ తిరిగి వస్తున్నారు నలుగురు సైనికులు.

ఒక మోకు కొసకు లావాటి చెట్టుకొమ్మను కట్టి గోడల మీదికి విసిరాడు షాడో. గోడలకున్న రాతి పలకల మధ్యన చెట్టుకొమ్మ చిక్కుపడి నిలిచిపోయింది.

తాడును ఒకసారి గట్టిగా లాగిచూసి, వుడుములా గోడమీదికి పాకాడు షాడో. పైకిపోయి ఒక రాతిపలకను పట్టుకుని పైకి లేవబోతుండగా సైనికులు అటుగా వచ్చారు.

చటుక్కున రాతిపలకను వదిలి, త్రాడుమీదే ప్రేలాడబడ్డాడు. ఆ చీకటిలో వారు అతన్ని గమనించలేదు. తమలో తాము మాట్లాడుకుంటూ ముందుకు సాగిపోయారు.

మెల్లిగా గోడమీదికి చేరుకున్నాడు షాడో. పగ్గాన్ని అక్కడే వదిలి, రెండవ మోకుతో గోడమీద అడుగులు వేశాడు.

కొద్దిదూరం పోగానే ... గోడ దిగటానికి అనువుగా రాతిమెట్లు కనిపించాయి. వాటి మీదుగా దుర్గంలోకి దిగి, కనిపించిన భవనం చాటున మోకరించి కూర్చున్నాడు.

మొత్తం పది భవంతులున్నాయా దుర్గంలో. రెండే రెంటిలో దీపాల వెలుగు బయటికి ప్రసరిస్తున్నది.

ఒక భవనంలో సైనికుల సంచలనం ముమ్మరంగా వుంది. రెండవ భవనం, పెద్ద పూలతోట మధ్య వుంది. నిశబ్దంగా వున్నదది. ద్వారాల ముందు కాపలా నిలబడిన సైనికులు తప్ప మరెవరూ ఆ భవన ప్రాంతంలో కనిపించటంలేదు.

మెల్లిగా అటుపోయాడు షాడో. పూలతోటను సమీపించి, పూపొదల చాటుగా అడుగులువేసి, ఆ భవనపు వెనుక భాగాన్ని చేరుకున్నాడు.

పెద్ద మర్రిచెట్టు ఒకటి భవనానికి పది అడుగుల దూరంలో ఎత్తుగా పెరిగివుంది. దాని కొమ్మలు భవనపు కిటికీలలోకి వ్యాపిస్తున్నాయి. కిటికీని సమీపించాడు.

మర్రిచెట్టు ఎక్కి, కొమ్మమీదుగా ఒక కిటికీని సమీపించాడు.

కిటికీ అవతలివైపు ఏదో సభామందిరంలా కనిపిస్తోంది. అందులో సైనికులు ఎవరూలేరు.

కొమ్మను వదిలి కిటికీగుండా ఆ మందిరంలోకి వెళ్ళాడు. అవతలి వైపున వున్న ద్వారాన్ని ఓరగా తెరిచి బయటికి తొంగి చూశాడు.

ఆ మందిరం పక్కనేవున్న మరో మందిరాన్ని కాపలా కాస్తున్నారు, ఇద్దరు సైనికులు. ఇద్దరూ కునికిపాట్లు పడుతున్నారు.

నిశబ్దంగా వెనుతిరిగి మళ్ళీ కిటికీలోనుంచి మర్రి కొమ్మమీదికి పోయాడు షాడో. ఈ సారి దాన్ని వదిలి, దాని పక్కనే వున్న కొమ్మమీదుగా రెండవగది కిటికీని సమీపించాడు.

కిటికీలోనుంచి తొంగి చూడగానే కనిపించారు — ఒక హంస తూలికా తల్పంమీద పడుకొని వుంది రాజకుమారి. ఆమె పక్కనే కూర్చుని వుంది నళినీదేవి.

ఇద్దరి వదనాలు విచారంలో మలినమైవున్నాయి. లోపలికి పోదామా, వద్దా అని సంశయించాడు షాడో. అంతలోనే ఆ మందిరంలోకి ఠీవిగా అడుగుపెట్టాడు ఒక ఆజానుబాహుడు.

రాచఠీవిని ప్రస్ఫుటంచేసే దుస్తులు ధరించి, మీసాలు మెలిపెడుతూ గదిలోవున్న తల్పాన్ని సమీపించాడు.

అతన్ని చూడగానే, రాకుమారి తల్పం మీదినుంచి దిగి దూరంగా నిలబడింది.

"హో హహ్హహ్హ ... రాకుమారి సిగ్గుపడుతుంది...ఇంకెంత కాలం సిగ్గు? మిమ్మల్ని వివాహమాడి, మీ చిత్రదుర్గ సింహాసనాన్ని అధిష్టించటమే నా ఏకైక లక్ష్యం..." అంటూ విరగబడి నవ్వాడతను.

"దుర్మార్గుడా ...అబలలను మోసగించి అపహరించే నీకు సింహాసనాలను అధిష్టించి, ప్రజలను పరిపాలించే అర్హతలేదు. దేవుడు నీకు తగిన శిక్ష విధిస్తాడు ...చూస్తూ వుండు ..." అన్నది నళినీదేవి.

"దేవుడు దయ్యం అనే వాటిని నమ్మి ... నీ తండ్రి అడవులు పట్టుకు తిరుగుతున్నాడు. ఆ దేవుణ్ణి నమ్మబట్టే నువ్వు నాట్యం చేసుకొని బ్రతుకుతున్నావు. నిన్ను బలవంతంగా అనుభవించే టప్పుడు నాకు ఏ దేవుడు అడ్డం వస్తాడో చూస్తాను." అంటూ ఆమెపైపు అడుగులు వేశాడు ఆ వ్యక్తి.

కెవ్వున అరిచి వెనక్కి జరిగింది నళిని.

వెంటనే ముందుకు దూకబోయాడు షాడో.

మరుక్షణం, కిటికీ చాటునుంచి ఇద్దరు సైనికులు షాడో ముందుకొచ్చారు. పదునైన కత్తుల్ని అతని గొంతుకు ఆనించి, "కదలకు ... కదిలితే నీ ప్రాణాలు నీవికావు" అని హెచ్చరించారు.

తెల్లబోయి ఎక్కడివాడక్కడే రాతిబొమ్మలా బిగుసుకుపోయాడు షాడో.

వికటంగా నవ్వుతూ, ఒక కత్తిని అందుకొని అటు వచ్చాడు నళినీదేవిని బెదిరించిన వ్యక్తి.

* * *

సభాసదులతో కిక్కిరిసి వుంది చిత్రదుర్గపు రాజసభ. కాళ్ళు చేతులు బంధింపబడిన ముకేష్, సింహాసనం ఎదుట నిలబడి వున్నాడు. అతని పక్కనే అదే విధంగా బంధింపబడి వున్నారు భూపతి, నిశంభులు.

"సభాసదులారా, సైనికులారా!" అంటూ అందర్నీ సంభోదిస్తూ లేచి నిలబడ్డాడు మహారాజు.

"పరాయి దేశస్తులని జాలిపడి ... కొలువు కూటమిలో చేర్చుకొని జాలి చూపించినందుకు, మంచి గుణపాఠం నేర్పేడా పరదేశి మహారాణి వారి మందిరంలో జొరపడి, రాజవంశానికి పూజనీయమైన పచ్చల పతకాన్ని దొంగిలించ ప్రయత్నించాడు. రాకుమారి, నళినీదేవీ అంతర్ధానానికి కారకుడు కూడా యితనే అని అనిపిస్తుంది. ఇతని సహచరుడైన మరో పరదేశి, రణదుర్గం వెళ్ళాడని తెలిసింది. మా అనుమానాలకు మరి ఇతర ఆధారాలు అనవసరం."

"ఇటువంటి ద్రోహులను కొలువులో చేర్పించి రాజాధికారి, నిశంభుడు కూడా నేరస్థుడైనాడు. వీరికి ఆశ్రయం యిచ్చిన పౌరుడు భూపతి మరో నేరస్థుడు. వీరందరి తప్పులకు సామాన్యమైన శిక్ష సరిపోదని భావిస్తున్నాం, రేపు సాయం సమయంలో సూర్యుడు అస్తమించబోతున్న తరుణంలో యీ ముగ్గుర్నీ వురి తీయవలసిందిగా ఆజ్ఞాపిస్తున్నాం. ఈ పరదేశి సహచరుడి జాడలు తెలియచేసినా, అతన్ని చంపి గుర్తుగా తల తీసుకువచ్చి చూపినా పదివేల వరహాలు బహుమతి యిస్తాం." అని ప్రకటించాడు.

నిశబ్దంగా విన్నారు సభికులు అందరూ. రాజాజ్ఞను కాదని అనటానికి ఆ పరదేశీయుల గురించి ఎవరికి పూర్తిగా తెలుసు?

రాజభటులు ముఖేష్ ని, భూపతి, నిశంభులను చెరసాలకు తీసుకుపోయారు.

మరునాడు సాయంత్రం ఆ ద్రోహులు ముగ్గురికీ వురిశిక్ష విధింపబడబోతున్నదని, చాటింపు వేయబడింది నగరమంతా.

(సశేషం)

రణదుర్గంలో బందీ అయిన షాడో, రాకుమారి రంజని, నర్తకి నళిని ఇద్దర్నీ రక్షించి చిత్ర దుర్గానికి తీసుకు రాగలడా లేదా?

అంతఃపుర ద్రోహిగా ముద్రపడి తనతోబాటు ఉరిశిక్షకు గురయిన భూపతి నిశంభుల గతి ఏమిటి?

నట్టడవిలో షాడో ముఖేష్ లు స్పృహ తప్పిన సమయంలో కాళీ విగ్రహాన్ని తీసుకెళ్ళిన అదృశ్యవ్యక్తి ఎవరు?

అసలీ ఇరవయ్యో శతాబ్దంలో సజీవంగా వున్న ఆ పురాతన రాచరికాల మిస్టరీ ఏమిటి? కలో నిజమో అర్థంకాని ఆ రాచరిక యుగంలోంచి షాడో, ముఖేష్ లు కాళీ విగ్రహంతో కలకత్తా చేరుకోగలరా?

ఆసక్తి కలిగించే ఈ విషయాలు తెలుసుకోవాలంటే చదివి తీరవలసిన నవల.

మీ అభిమాన రచయిత మధుబాబు సరికొత్త రచన "చిచ్చర పిడుగు" రెండో ఆఖరి భాగం—

---

*డాగర్ ఆఫ్ షాడో*

---

ఎప్పుడో పన్నెండు సంవత్సరాల క్రితం వ్రాయటం మొదలు పెట్టిన నవల చిచ్చరపిడుగు, కత్తియుద్ధాలు, గుర్రపు స్వారీలు రాజకుమార్తెలు, రాజదర్బారుల టైమ్ లో షాడో వుంటే అతని పోకడ ఎలా వుంటుందని అప్పట్లో కొందరు షాడో అభిమానులు అడిగితే నవలా రూపంలో సమాధానం ఇస్తానని చెప్పాను.

ఏవేవో కారణాలవల్ల 'చిచ్చరపిడుగు' మధ్యలో ఆగిపోయింది. తిరిగి ఇంతకాలానికి పూర్తిచేసి మీ ముందుకు తీసుకురావటం జరుగుతోంది.

ఇది సరాదాగా వ్రాసిన కథ. ఇందులో మాదిరిగా జరుగుతుందా అని ప్రశ్నిస్తే సమాధానం నా వద్ద లేదు. మొదటిభాగం వ్రాసి చాలాకాలం అవటం వల్ల నా ఎక్స్ ప్రెషన్స్ లోను, శైలిలోను తేడా చాలా ఎక్కువగా కనిపిస్తుంది. రెండవభాగం ఇప్పుడు వ్రాయటంవల్ల ఈ డిఫరెన్స్ కొట్టవచ్చినట్లు గోచరిస్తుంది.

సాధ్యా సాధ్యాల విషయాన్ని వదిలేసి ఒకసారి షాడోతోపాటు మీరుకూడా ఆకాలంలోకి వెళ్ళండి. అప్పటి పరిస్థితులకు ఎడ్జస్ట్

కావటానికి అతను పడే పాట్లను గమనించండి— ఎంజాయ్ చేయండి.

అభినందనలతో

మధుబాబు.